వరంగల్ వాయిస్
www.warangalvoice.net
Evening Daily
వరంగల్ | సంపుటి : 03 | సంచిక : 69 | గురువారం | 07 సెప్టెంబర్ 2023 | పేజీలు : 10 | వెల రూ. 5



# ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు

ఉత్సాహంగా పాల్గొన్న విద్యార్థులు

10లో..



10లో..

## నాపై వచ్చిన ఆరోపణల్లో నిజం లేదు

విద్యార్థులే రెచ్చిపోయి ప్రవర్తించారు

వరంగల్ సీపీ రంగనాథ్



10లో..

## ఘనంగా ధ్వజ స్తంభ ప్రతిష్ఠాపన

పాల్గొన్న ఎమ్మెల్యే దంపతులు



# హస్తం నయా అస్త్రం

తూర్పు బరిలో ఎన్ఆర్ఐ

కాంగ్రెస్ టికెట్ ఆయనకే అంటూ ప్రచారం

రాహుల్ గాంధీకి అత్యంత సన్నిహితుడిగా గుర్తింపు

మారుతున్న సమీకరణాలు

రేపు నియోజకవర్గంలో పర్యటించనున్న సామల ప్రదీప్ కుమార్

సురేఖకు సిరిసిల్ల టికెట్ కేటాయిస్తారంటూ ప్రచారం

హస్తం ఎన్ఆర్ఐ రూపంలో నయా అస్త్రాన్ని ప్రయోగించనుంది. ఎన్నో ఏళ్లుగా కాంగ్రెస్ పార్టీకి కంచుకోటగా నిలిచిన వరంగల్ తూర్పులో తిరిగి తమ ఆధిపత్యాన్ని కొనసాగించేందుకు కాంగ్రెస్ పార్టీ పావులు కదుపుతోంది. నియోజకవర్గంలో పార్టీకి ఉన్న ఓటు బ్యాంక్‌తోపాటు ఇక్కడ మెజార్టీ ఓటర్లు కలిగిన పద్మశాలీలనే బరిలో నిలుపడం ద్వారా అనుకున్న లక్ష్యాలను ఈజీగా చేరుకోవచ్చని భావిస్తోంది. ఎన్నో సామాజిక కార్యక్రమాలు నిర్వహిస్తూ తూర్పులో తనదైన ముద్ర వేసుకుంటున్న ఎన్ఆర్ఐ సామల ప్రదీప్ కుమార్ కు టికెట్ కేటాయించడం ద్వారా విజయం నల్లేరుపై నడకే అవుతుందని అంచనా వేస్తున్నారు. ఈ మేరకు శుక్రవారం నగరానికి రానున్న ఆయనకు ఘనంగా స్వాగతం పలికేందుకు పార్టీ శ్రేణులు, అభిమానులు సిద్ధపడుతున్నారు. ఇప్పటికే నగరంలోని పలు ప్రాంతాల్లో భారీ హోర్డింగులు ఏర్పాటు చేశారు.  అయితే తూర్పుపై ఆశలు పెంచుకున్న కొండా సురేఖకు సిరిసిల్ల టికెట్ కేటాయించనున్నట్లు ప్రచారం సాగుతోంది.

- వరంగల్ వాయిస్ ప్రతినిధి



వివరాలు 2లో..

# హస్తం నయా అస్త్రం



- తూర్పు బరిలో ఎన్ఆర్ఐ
- కాంగ్రెస్ టికెట్ ఆయనకే అంటూ ప్రచారం
- రాహుల్ గాంధీకి అత్యంత సన్నిహితుడిగా గుర్తింపు
- మారుతున్న సమీకరణాలు
- రేపు నియోజకవర్గంలో పర్యటించనున్న సామల ప్రదీప్ కుమార్
- సురేఖకు సిరిసిల్ల టికెట్ కేటాయిస్తారంటూ ప్రచారం

**వరంగల్ వాయిస్ ప్రతినిధి :** హస్తం పార్టీ నయా అస్త్రాన్ని ప్రయోగించేందుకు సిద్ధపడుతోంది. వరంగల్ తూర్పు బరిలో పాగా వేయాలంటే దమ్మున్న నాయకుడు కావాలని భావించిన కాంగ్రెస్ పార్టీ పద్మశాలి సామాజిక వర్గానికి చెందిన ఎన్ ఆర్ ఐ సామల ప్రదీప్ కుమార్ ను రంగంలోకి దింపుతోంది. రాహుల్ గాంధీకి అత్యంత సన్నిహితుడిగా గుర్తింపు పొందిన ఆయనకు టికెట్ కన్ఫామ్ గా చెప్పుకొంటున్నారు. అయితే ఇప్పటివరకు కేవలం సామాజిక కార్యక్రమాలకే పరిమితమైన ఆయన తూర్పు నుంచే రాజకీయ ఆరంగ్రేటం చేయనున్నారు. ఈ మేరకు శుక్రవారం వరంగల్ తూర్పు నియోజకవర్గంలో పర్యటించేందుకు రంగం సిద్ధం చేసుకున్నారు. అయితే సామల ప్రదీప్ కుమార్ కు ఘన స్వాగతం పలికేందుకు పార్టీ శ్రేణులు, అభిమానులు, కులస్థులు కలిసి వస్తున్నారు. త్వరలో జరుగనన్న ఎన్నికల్లో గెలిపించుకునేందుకు పద్మశాలీలంతా ఒక్కటవుతున్నారు. ఇప్పటికే నగరంలో భారీ హోర్డింగులు ఏర్పాటు చేశారు. అడుగడుగునా ఆయనకు స్వాగతం పలికేలా ఏర్పాట్లు చేస్తున్నారు. పద్మశాలీలు ఎక్కవగా నివసించే తూర్పు నియోజకవర్గంనుంచే తన రాజకీయ సేవా కార్యక్రమాలను ప్రారంభించాలన్న లక్ష్యంతో కాంగ్రెస్ పార్టీనుంచి టికెట్ కోసం దరఖాస్తు చేసినట్లు అత్యంత సన్నిహితులు వెల్లడించారు.

## ఎస్ జేపీ ఫౌండేషన్ ద్వారా సేవా కార్యక్రమాలు..

అమెరికాలో స్థిరపడిన సామల ప్రదీప్ కుమార్ తాను పుట్టిన గడ్డకు సేవ చేయాలన్న సంకల్పంతో తన తండ్రి గారైనా సామల జయ ప్రకాష్ పేరు కలిసొచ్చేలా ఎస్ జేపీ ఫౌండేషన్ ను స్థాపించి పలువురు నిరుపేదలకు అండగా నిలుస్తున్నారు. వరంగల్ లో పలు ధార్మిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అవసరార్థులకు సాయం చేయడం, నిరు పేదలను అక్కున చేర్చుకుని ధైర్యం కల్పించడం వంటివి విరివిగా చేస్తున్నారు. కేవలం కులబాంధవులే కాదు, పేదలకు అడక్కుండానే సాయం చేసేంత దయార్థ హృదయం ప్రదీప్ కుమార్ ది. స్వచ్ఛంద సంస్థలో పలువురిని బాధ్యులుగా నియమించి, సేవా కార్యక్రమాల్లో ఎక్కడా ఎలాంటి లోటుపాట్లు రాకుండా చూస్తున్న గొప్ప మానవతావాది. సంవత్సరాల తరబడి నగరంలో పలు స్వచ్ఛంద సేవా కార్యక్రమాల ద్వారా పేదలకు అండగా నిలుస్తున్నారు.

## న్యూయార్క్‌లో భారీ యాత్ర...

వరంగల్ లో డిగ్రీ పూర్తి చేసిన సామల ప్రదీప్ కుమార్ యూఎస్ లో స్థిరపడ్డారు. అమోరికాలోని ఇండియన్ ఓవర్సిస్ కాంగ్రెస్ కు వర్కింగ్ ప్రెసిడెంట్ గా విధులు నిర్వహిస్తూనే పార్టీ కార్యక్రమాలను చురుగ్గా ప్రజల్లోకి తీసుకుపోవడంలో సామల ప్రదీప్ కుమార్ దిట్ట. టైమ్స్ స్క్వేర్ నుంచి మహాత్మాగాంధీ విగ్రహం వరకు జరిపిన యాత్ర అందుకు ప్రత్యక్ష సాక్ష్యంగా నిలుస్తోంది. రాహుల్ భారత్ జోడో యాత్ర స్ఫూర్తితో శ్యామ్ పిట్రోడా మార్గదర్శకత్వంతో ఆయన న్యూయార్క్ లో నిర్వహించిన పాదయాత్రలో సుమారు వెయ్యి మందికిపైగా ఇండియన్స్ పాల్గొనడం ఓ సెన్సేషన్ గానే చెప్పవచ్చు. అదే స్ఫూర్తితో ప్రదీప్ కుమార్ ఇటు తెలంగాణతో పాటు అటు మహారాష్ట్రలో కూడా రాహుల్ జోడో యాత్రలో ఉత్సాహంగా పాల్గొన్నారు. అలాగే టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి పిలుపుమేరకు హాథ్ సే హాథ్ జోడో యాత్రలో కూడా ఉత్సాహంగా పాల్గొని పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం నింపారు. సామల ప్రదీప్ కుమార్ నార్త్ అమెరికాలో నాన్-ప్రాఫిట్ ఆర్గనైజేషన్ని స్థాపించారు. ఆయన పద్మశాలి అసోసి యేషన్, పద్మశాలి ఎన్ఆర్ఐలతో కలిసి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. పద్మశాలి అసోసియేషన్ ప్రపంచ వ్యాప్తంగా ఉన్న కులస్తులందరినీ ఒక్కతాటిపైకి తేవడానికి ఇంటింటికీ తిరుగుతూ మోటివేషన్ కల్పిస్తోంది.




## కోరుట్ల గర్జనే స్ఫూర్తిగా..

జగిత్యాల జిల్లా కోరుట్లలో జరిగిన పద్మశాలీ గర్జనలో కులస్తులంతా ముక్తకంఠంతో నినదించారు. తమ కులస్తు లకు సరైన ప్రాధాన్యం దక్కడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కులస్తులకు టిక్కెట్ ఇస్తే ఏ పార్టీ అనేది కూడా చూడకుండా గెలిపించుకుని తీరుతామని శపథం చేశారు. కులాన్ని గుర్తించని పార్టీలను పాతాళానికి తొక్కేస్తామని ప్రతిన బూనారు. ఈ క్రమంలోనే వరంగల్ తూర్పులో పద్మశాలీ కులస్తుడైన సామల ప్రదీప్ కుమార్ బరిలో నిలిస్తే గెలుపు నల్లేరుపై నడకలాగే మారుతోందన్న ప్రచారం సాగుతోంది. తీవ్ర అన్యాయానికి గురైన కులస్తులు అంతర్గతంగా కసితో ఉన్నారు. పార్టీలతో సంబంధం లేకుండా గెలిపించుకుని అసెంబ్లీ సాక్షిగా బలాన్ని చాటుకోవాలని పట్టుదలతో ఉన్న మాట నూటికి నూరుపాళ్లు అక్షర సత్యం. కాంగ్రెస్ పార్టీ సామల ప్రదీప్ కుమార్ కు టిక్కెట్ ఇస్తే గెలిచే అవకా శాలు భారీగా ఉన్నాయని విశ్లేషకులు సైతం చెబుతున్నారు.

## అమెరికాలో పార్టీ బాధ్యతలు..

గత కొన్ని సంవత్సరాలుగా అమెరికాలో స్థిరపడిన సామల ప్రదీప్ కుమార్ ఎంటర్ప్రెన్యూర్‌గా ఉంటూనే, ఎన్నో ఐటీ కంపెనీలు స్థాపించారు. ప్రస్తుతం న్యూయార్క్ లోని ఓ కంపెనీకి సీఈవో వ్యవరిస్తున్నారు. అనేక రియల్ ఎస్టేట్ వెంచర్లలో భాగస్వామిగా కొనసాగుతున్నారు. రిటైల్ ఫ్రాంచైజీలను కలిగి ఉండటం, 20 సంవత్సరాలుగా కమ్యూనిటీ సేవల్లో పాల్గొనడం ఆయనుకున్న బలంగా చెప్పుకొంటారు. సామల ప్రదీప్ కుమార్ ఇండియన్ ఓవర్సీస్ కాంగ్రెస్ లో కీలకంగా వ్యవహరిస్తున్నారు. ఇండియన్ ఓవర్సీస్ కాంగ్రెస్ అధ్యక్షుడు మొహిందర్ సింగ్, వైస్ చైర్మన్ జార్జ్ అబ్రహం, గ్లోబల్ చైర్మన్ శామ్ పిట్రోడా నేతృత్వంలో ఎన్నో కార్యక్రమాలను ప్రదీప్ కుమార్ ఘనంగా నిర్వహించారు. ఈ క్రమంలోనే గత జూన్ 23వ తేదీన ఈవెంట్ కన్వీనర్ గా భారీ సమావేశాన్ని ఏర్పాటు చేసి ఘనంగా జరగడానికి తీవ్రంగా శ్రమించారు. అలాగే రాహుల్ గాంధీ న్యూయార్క్ పర్యటనకు ఆరు వేలకుపైగా ప్రవాసభారతీయులను ఒక్క కాడికి తీసుకొచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఇండియన్ ఓవర్సీస్ కాంగ్రెస్ నిర్వహించిన అతి పెద్ద ఈవెంట్లలో ఇది ఒకటిగా పార్టీ శ్రేణులు అభివర్ణిస్తుంటారు. యూఎస్ లో రాహుల్ కార్యక్రమానికి ఓవర్సీస్ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ గా సామల ప్రదీప్ కుమార్ చేసిన సమన్వయం, ఆ ప్రోగ్రాం భారీగా విజయవంతంగా జరగడం కాంగ్రెస్ అమెరికా చరిత్రలో ఓ మర్చిపోలేని ఘట్టంగా పార్టీ శ్రేణులు ప్రశంసిస్తుంటాయి.

## ఆత్మహత్యలతో చలించి..

తాను పద్మశాలి కమ్యూనిటీ నుంచి వచ్చిన వ్యక్తినని, తమది వరంగల్ లో అతిపెద్ద సంఘంగా కొనసాగు తోందని ప్రదీప్ కుమార్ పేర్కొంటున్నారు. ఇప్పటికీ కుల వృత్తిపైనే బతుకులు వెళ్లదీస్తూ దీనమైన పరిస్థితుల్లో ఉన్నవారిని చూస్తే గుండె తరుక్కుపోతోందంటున్నారు. చేనేత వృత్తిపై ఆధారపడిన వారిలో చాలా మంది కూలీలుగా కూడా చేస్తున్నారని, తగినంత సంపాదన లేక పూటగడవని దయనీయ స్థితిని అనుభవిస్తున్నారని ఆవేదన వెలిబుచ్చారు. చేనేత కార్మికులు కుటుంబాలు గడువక ఆత్మహత్యలు చేసుకున్న ఘటనలు ఎన్నో రోజు వార్తల్లో చూడాల్సి రావడం దురదృష్టకరమని గుర్తు చేశారు. ఇలాంటివి చూసే స్వచ్ఛందంగా ఎస్ జేపీ ఫౌండేషన్ ఏర్పాటు చేసి పేదలకు, తెలంగాణలోని సమాజానికి సేవ చేస్తున్నానని చెప్పుకొచ్చారు.

## సురేఖకు సిరిసిల్ల టికెట్..

వరంగల్ తూర్పు టికెట్ తనకే అంటూ ఇప్పటికే ప్రచారం సాగిస్తున్న కొండా సురేఖకు చుక్కెదురైనట్లు ప్రచారం సాగుతోంది. ఆమెకు పద్మశాలీలు ఎక్కువగా నివసించే సిరిసిల్ల టికెట్ కేటాయించాలని పార్టీ భావిస్తున్నట్లు సమాచారం. అక్కడ సిట్టింగ్ ఎమ్మెల్యే, మంత్రిగా సీఎం కేసీఆర్ తనయుడు కల్వకుంట్ల తారక రామారావు బీఆర్ ఎస్ తరుపున మరోమారు బరిలో నిలువనున్నారు. కేటీఆర్ పై సురేఖను పోటీకి నిలుపడం ద్వారా సిరిసిల్లలో పద్మశాలీ ఓట్ల ద్వారా ఆమె విజయం సాధించే అవకాశాలు ఉంటాయని భావిస్తున్నారు. ప్రతికూల పరిస్థితులు ఏర్పడి సురేఖ అపజయం పాలైతే ఆమెకు ఎమ్మెల్సీ టికెట్ ఇచ్చి మంత్రి పదవి కట్టబెట్టేలా కాంగ్రెస్ అధిష్ఠానం భావిస్తున్నట్లు లీకులు అందుతున్నాయి.










## కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్‌లోకి చేరికలు



**వరంగల్ వాయిస్, తొర్రూరు :** మండలంలోని కంటాయపాలెం మాజీ సర్పంచ్ పల్లె సర్వయ్య, హరిపిరాల, దుబ్బ తండా, మంగళి సాయి తండాకు చెందిన కాంగ్రెస్ నేత జాటోత్ భాస్కర్ లు 20మంది, కొడకండ్ల మండలం, రామవరం గ్రామానికి చెందిన యూత్ కాంగ్రెస్ నాయకులు శ్రావణ్, ప్రశాంత్ యాదవ్ లతో పాటు 50మంది బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నేత పోనుగోటి సోమేశ్వర్ రావు అధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీలో చేరగా, రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి గ్రామీణ మంచినీటి సరఫరా శాఖల మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన నాయకులు మాట్లాడుతూ సీఎం కేసీఆర్ , మంత్రి ఎర్రబెల్లి చేసిన అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలు చూసి బీఆర్ఎస్ పార్టీలో చేరుతున్నామన్నారు. పార్టీలో చేరిన వారిని ఉద్దేశించి మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు మాట్లాడుతూ పార్టీలో చేరిన వారికి సముచిత స్థానం కల్పిస్తామని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో మరోసారి బీఆర్ఎస్ పార్టీని గెలిపించడానికి శాయశక్తులా కృషి చేయాలి కోరారు.

## సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు పంపిణీ



**వరంగల్ వాయిస్, మల్హర్ :** మండలంలోని తాడిచెర్ల గ్రామానికి చెందిన చెన్నూరి చిన్నయ్యకు రూ.14,000 విలువైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు మంజూరు కాగా, ఆ చెక్కును పెద్దపల్లి జెడ్పీ చైర్మన్ పుట్ట మధు, భూపాలపల్లి జడ్పీ చైర్ పర్సన్ జక్కు శ్రీహర్షిని రాకేష్ ఆదేశాల మేరకు గురువారం మండల బీఆర్ఎస్ నాయకులు లబ్దిదారుడికి అందజేశారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మెన్ మల్క సూర్య ప్రకాష్ రావు, నాయకులు మల్లేష్, బూడిద సదానందం, మధుసూదన్ రావు, రాజేశ్వర రావు, తదితరులు పాల్గొన్నారు.

## పార్కింగ్ స్థలం ఏర్పాటు చేయాలి



**వరంగల్ వాయిస్, భూపాలపల్లి:** మున్సిపాలిటీ పరిధిలో వాహనదారులకు పార్కింగ్ స్థలం ఏర్పాటు చేయాలని ఆమ్ ఆద్మీ పార్టీ జయశంకర్ భూపాలపల్లి జిల్లా కన్వీనర్ నాగుల అరవింద్ అన్నారు. నిత్యం ఏదో వస్తువు కోసం షాపులకు వస్తూ పోతూ ఉంటారు ప్రజానీకం. దుకాణం ముందు పార్కింగ్ చేస్తే ట్రాఫిక్ సిబ్బంది ఫొటో కొట్టి చలానా వేస్తూ వాహనదారుల తీవ్ర ఇబ్బంది గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు .జయశంకర్ విగ్రహం నుంచి గణేష్ చౌక్ వరకు కూడా నిత్యం వ్యాపార లావాదేవీలు జరుగుతూ ఉంటాయి. వెంటనే పార్కింగ్ స్థలం ఏర్పాటు చేసి ట్రాఫిక్ సమస్య లేకుండా చూడవలసిన బాధ్యత ప్రభుత్వం మీద ఉందన్నారు. వెంటనే పార్కింగ్ స్థలం ఏర్పాటు చేయాలని లేని పక్షంలో ఆమ్ ఆద్మీ పార్టీ నుంచి పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో యువజన విభాగం జిల్లా ఇంచార్జి కొండ్ర సాయితేజ, ఆప్ నాయకుడు సాయి, తదితరులు పాల్గొన్నారు.

# తెగిన రోడ్లను పట్టించుకోరా?

**భారీ వర్షాలకు దెబ్బతిన్న రహదారులు**

**నెలలు గడుస్తున్నా మరమ్మతుకు నోచుకోని వైనం**

**పట్టించుకోని ప్రజాప్రతినిధులు, అధికారులు**

**ధ్వంసమైన రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని సీపీఐ, కాంగ్రెస్ నాయకుల డిమాండ్**



**వరంగల్ వాయిస్, రేగొండ :** మండలంలోని తిరుమలగిరి గ్రామంలో ధ్వంసమైన రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని సీపీఐ, కాంగ్రెస్ పార్టీ, యూత్ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం తిరుమలగిరి గ్రామంలోని పలు చెరువు కుంటలు, పకృతికి నిలయమైన పాండవుల గుట్ట, బుగులోని జాతరకు పోయే రోడ్లు తెగినందువల్ల వెంటనే మరమ్మత్తులు చేయాలని గురువారం సీపీఐ, కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి సందర్శించారు. తెగిన రోడ్లను చెరువుకుంటలను ముందుగా పరిశీలించి స్థానిక ప్రజాప్రతినిధులు అధికార పార్టీ ఎమ్మెల్యే వెంటనే మరమ్మతులు చేయాలని వారు పార్టీల జెండాలను పట్టుకొని తెగిన రోడ్లపై చెరువుకుంటల వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ సిపిఐ పార్టీ నాయకులు జిల్లా కార్యవర్గ సభ్యుడు వెంకటేష్, కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు నిమ్మల విజేందర్, గ్రామ యూత్ నాయకులు సిరపురం శివ లు మాట్లాడారు.రేగొండ నుండి భూపాలపల్లి కి వెళ్లి జాతీయ రహదారి తిరుమలగిరి ఆర్చి నుండి శ్రీ భుగులోని వెంకటేశ్వర స్వామి జాతర వరకు సుమారుగా ఆరు రహదారుల్లోని రోడ్లు తెగిపోయాయని, దానితో ఊరిలో గ్రామ ప్రజల రాకపోకలు నిలిచిపోయిన నెలల తరబడి ఉన్న అధికార యంత్రాంగం ప్రజాప్రతినిధులు స్థానిక ఎమ్మెల్యే ఏమాత్రం



స్పందించకపోవడం విచారకరమన్నారు. పకృతికి నిలయమైన పాండవుల గుట్టకు ఆటో జూబ్లీ నగర్ రోడ్డు నుంచి పాండవుల గుట్ట మీదగా బుగులోని జాతర వరకు వెళ్లే రహదారి కూడా తెగిపోవడంతో, బుగులోని జాతరకు వచ్చేటువంటి భక్తులకు రవాణా సౌకర్యానికి అంతరాయం ఏర్పడిందన్నారు. రోడ్లు, కుంటలు తెగినా స్థానిక ప్రజాప్రతినిధులు స్పందించకపోవడం చాలా బాధాకరమని వెంకటేష్, గ్రామ కమిటీ అధ్యక్షుడు నిమ్మల విజేందర్, శివలు ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం గ్రామాల అభివృద్ధి ధ్యేయంగా పనిచేస్తున్నామని గొప్పలు చెప్పుకుంటున్నారు తప్పా, గ్రామంలో ఉన్న గ్రామ సర్పంచి, ఉపసర్పంచి, ఎంపీటీసీ, గుడి ఆలయ కమిటీ చైర్మన్లు ఇంత జరుగుతున్న గ్రామ ప్రజల రైతుల ఇబ్బందులను ఏమాత్రం పట్టించుకోకపోవడం అభివృద్దా..? అని వారు ప్రశ్నించారు. తెగిన చెరువు కుంటలను, రోడ్లను మరమ్మత్తు చేయించేలా స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికార పార్టీ నాయకులు, సంబంధిత అధికారులు ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి దృష్టికి తీసుకువెళ్లి వెంటనే మరమ్మత్తులు చేయించాలని, సమావేశం అనంతరం నిరసన ప్రదర్శనలు చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ పార్టీ గ్రామ శాఖ కార్యదర్శి కుక్కల సాగర్, సహాయ కార్యదర్శి చిగురుమామిడి మోహన్, చెక్క కుమారస్వామి, పెద్దపల్లి రమేష్, కర్రె రఘుపతి, కాంగ్రెస్ పార్టీ నాయకుడు, కిసాన్ సెల్ జిల్లా కార్యవర్గ సభ్యుడు గంగుల రమణారెడ్డి, బీసీ సెల్ మండల ప్రధాన కార్యదర్శి సుంకు జితేందర్, గ్రామ ఉపాధ్యక్షులు తిరుపతి, మల్యాల కొమరయ్య, కోశాధికారి పన్నాటి శ్రీనివాస్, బీసీ సెల్ అధ్యక్షుడు కుక్కల విష్ణు, ప్రధాన కార్యదర్శి మాచర్ల రాజయ్య, మాచర్ల కిషోర్, యువజన సంఘాల నాయకులు రుద్రవీణ, కుమారస్వామి, చెక్క వేణు, గంట పవన్, భరత్, గడ్డం మహేష్, మంతపూరి వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

## పల్లెల్లో విష జ్వరాల విజృంభణ

**వరంగల్ వాయిస్, మల్హర్ :** మండలంలోని పలు గ్రామాల్లో ప్రజలు విష జ్వరాల బారిన పడి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వానాకాలం సీజన్ కావడంతో దోమలు ఎక్కువ ఉండటం, వాతావరణ మార్పుల వల్ల ప్రజలు విష జ్వరాల బారిన పడుతున్నారు. జ్వరంతో పాటు తీవ్రమైన ఒంటి నొప్పులు, దగ్గు, జలుబుతో మంచానికే పరిమితం అవుతున్నారు. గ్రామాల్లో విష జ్వరాలు విజృంభిస్తున్న వైద్య సిబ్బంది, అధికారులు గ్రామాల వైపు కన్నెత్తి కూడా చూడకపోవడం పట్ల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రామాల్లో విష జ్వరాలు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

## సమగ్ర శిక్ష్యా అభ్యాన్ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి



**వరంగల్ వాయిస్, డోర్నకల్ :** తెలంగాణ సమగ్ర శిక్షా అభ్యాన్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని టీఎస్ యూటీఎఫ్ డోర్నకల్ మండల అధ్యకుడు అబ్దుల్ అజీజ్, ప్రధాన కార్యదర్శి శివప్రసాద్ లు అన్నారు. డోర్నకల్ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. ఉద్యోగులను పర్మినెంట్ చేయాలనే డిమాండ్ తో వారు చేస్తున్న దీక్షా కార్యక్రమానికి టీఎస్ యూటీఎఫ్ సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ గత 15ఏళ్లుగా వివిధ శాఖలలో సమగ్ర ఉద్యోగులతో వెట్టి చాకిరీ చేయించుకుంటున్న ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా 22వేల మంది ఉద్యోగులను పర్మినెంట్ చేయకుండా వాళ్ల ఉసురు పోసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు నాగరాజు సినీయర్ నాయకులు కాసు మారెడ్డి, ఉపాధ్యక్షులు దేవేందర్, బుచ్చయ్య, సోమనబోయిన శ్రీను, వెంకటప్పయ్య, లక్ష్మి ప్రసాద్, రేణుక, అమీనా, దేవుల రాములు, సీతరాములు, తదితరులు పాల్గొన్నారు.

# బలహీన వర్గాలకు అండగా బీఆర్ఎస్ ప్రభుత్వం



**వరంగల్ వాయిస్, పర్వతగిరి :** దేశంలో పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజలకు అండగా నిలుస్తున్న ఏకైక ప్రభుత్వం బీఆర్ఎస్ ప్రభుత్వమని, బీఆర్ఎస్ పార్టీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు, వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేష్ అన్నారు. పర్వతగిరి మండలంలోని పలు గ్రామాలకు చెందిన 39మంది కల్యాణ లక్ష్మి లబ్ధిదారులకు రూ.39 లక్షల 04 వేల 524 చెక్కులను కల్లెడ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో అరూరి రమేష్ లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ఈ పథకం పేద ప్రజలకు ఎంతో ఆసరాగా నిలుస్తుందన్నారు. పేదల సంక్షేమానికి ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తుందని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ సహాయంతో ఎంతో మంది పేద కుటుంబాలకు పెండ్లిల భారం తగ్గిందని తెలిపారు. ఆడపిల్లల తల్లిదండ్రులు ఆర్థికంగా ఇబ్బంది పడొద్దనే ఉద్దేశంతో సీఎం కేసీఆర్ కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను ప్రవేశపెట్టారని అన్నారు. ఆరోగ్య శ్రీలో వర్తించని వ్యాధులకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా వైద్య చికిత్సకు తగిన ఆర్థిక సాయం బాధితులకు అందిస్తోందని అన్నారు. అనంతరం ముఖ్య మంత్రి సహయ నిధి ద్వారా మంజూరైన 6చెక్కుల లబ్ధిదారులకు ఎమ్మెల్యే అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# కేయూ విద్యార్థులకు అండగా జంగా రాఘవరెడ్డి

**వరంగల్ వాయిస్, కేయూ :** తెలంగాణ ఉద్యమానికి ఊపిరి పోసిన విద్యార్థులపై బీఆర్ఎస్ పార్టీ రాజకీయ కక్ష సాధింపు చర్యలు తగవని కాంగ్రెస్ పార్టీ నేత జంగా రాఘవరెడ్డి అన్నారు. కాకతీయ విశ్వవిద్యాలయం పీ హెచ్ డీ సీట్ల పంపిణీ విషయంలో జరిగిన అవకతవకలపై న్యాయపరమైన పోరాటం చేస్తున్న విద్యార్థులను అక్రమంగా అరెస్టు చేపించి కాళ్లు చేతులు విరిగేలా చిత్రహింసలు చేయడం హేయమైన చర్య అని ఫైరయ్యారు. రిజర్వేషన్ కు సంబంధించిన విద్యార్థులను ఓపెన్ కోటలోకి మళ్లించి పార్ట్ టైం లెక్చరర్లకు సీట్లు అమ్ముకున్నారని ఆరోపించారు. ఈ విషయంపై న్యాయపోరాటానికి దిగిన విద్యార్థులపై అక్రమ కేసులు పెట్టడం ఏంటని ప్రశ్నించారు. తెలంగాణ ఉద్యమంలో అసువులు బాసింది విద్యార్థులే గాని, బీఆర్ఎస్ పార్టీ నాయకులు కాదని జంగా రాఘవరెడ్డి పేర్కొన్నారు. కాబట్టి విద్యార్థుల అక్రమ అరెస్టును ఖండించి హుటాహుటిన అర్ధరాత్రి అక్కడకు చేరుకొని విద్యార్థులకు అండగా నిలిచి వారికి బెయిల్ ఇప్పించేంత వరకు ఉండి బాసటగా నిలిచారు. విద్యార్థులు వారి న్యాయమైన డిమాండ్ల కోసం పోరాటం చేస్తా ఉంటే అక్రమ అరెస్టు చేసి వారిని ఒక పోలీస్ స్టేషన్ నుంచి మరొక పోలీస్ స్టేషన్ కు, ఒక ప్రదేశం నుంచి మరొక ప్రదేశానికి తిప్పుకుంటూ చిత్రహింసలకు గురి చేసిన పోలీసులను కఠినంగా శిక్షించి వారిపై చట్టపరిమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా దీనంతటికి కారకులైనటువంటి కాకతీయ



విశ్వవిద్యాలయం వీసీ పై కేసు నమోదు చేయాలని విజ్ఞప్తి చేశారు. తెలంగాణ మలిదశ ఉద్యమంలో విద్యార్థుల పోరాట పటిమ, బలిదానాలను చూసి చలించిపోయిన సోనియా గాంధీ తెలంగాణ ఇచ్చిందన్న సంగతి మరవకూడదని అన్నారు. రాబోయే కాలంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని, విద్యార్థుల సమస్యలన్నీ కూడా తీరుస్తుందన్నారు. విద్యార్థులు, నిరుద్యోగులు, మేధావులు మేల్కొని ఈ నియంతృత్వ, నియంత, రాచరిక పాలన సాగిస్తున్న ప్రభుత్వాన్ని అంతమొందించాలని కోరారు.

## వామ్మో ఈ రోడ్డు.. యమ డేంజర్..!

### ప్రాణాలు పోయినా పట్టించుకోరా

### నిమ్మకు నీరెత్తినట్లు అధికారులు



**వరంగల్ వాయిస్, చెన్నారావుపేట :** మండలం నుంచి పాపయ్యపేట –జోజిపేట వరకు ఎక్స్ రోడ్‌కు వెళ్లే ప్రధాన రహదారి యమ డేంజర్‌గా తయారైంది. వాహనాల రాకపోకలు విపరీతంగా పెరగడంతో ప్రధాన రహదారి పరిస్థితి అధ్వానంగా ఉంది. తిమ్మరాయిన్ పహేడ్ వద్ద ఉన్న ప్రధాన రహదారి గుంతలమయంగా తయారు కావడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. బస్సు సౌకర్యం కూడా బంద్ అయ్యేలా ఉందని, స్కూల్ బస్సులు కూడా పోలేని పరిస్థితి ఏర్పడిందని, వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ రహదారి గుండా ప్రజలు ఆటోలలో, వాహనాలపై రద్దీగా ప్రయాణం సాగిస్తూ ఉంటారు. నిన్న మొన్న కురిసిన వర్షాలకు ప్రధాన రహదారి గుంతల మయం కావడంతో టూ వీలర్ వాహనం వెళ్లలేని పరిస్థితిలో ఉందంటే పరిస్థితి ఏంటో అర్థం చేసుకోవచ్చు. దీనికి తోడు ఈ మధ్య సిమెంటు ట్యాంకర్లు, మట్టి మొరం లారీలు, టిప్పర్ వాహనాలు విచ్చలవిడిగా తిరగడంతో రహదారి పూర్తిగా పాడైంది. ఏర్పడిన గుంతల వద్ద ఎదురుగా గుంతలు ఉండడంతో అదుపుతప్పి వాహనదారులు కాలువలో పడే అవకాశం ఉంది. దీంతో ఎదురుగా వస్తున్నా వాహనం పక్కకు ఆగడం తప్ప మరో మార్గం లేకుండా పోవడంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పగలే ఇటువంటి పరిస్థితి ఉంటే రాత్రి వేళలో ఎప్పుడూ ఎటువంటి ప్రమాదం జరుగుతుందో తెలియని పరిస్థితి దాపురించింది. దీంతో వాహనదారులు బేజార్ అవుతున్నారు. తక్షణమే ఆర్ అండ్ బీ అధికారులు రోడ్డు మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.ప్రజల ప్రాణాలు పోతే గాని అధికారులు పట్టించుకోరా అని వాహనదారులు, ప్రజలు మండిపడుతున్నారు.

## నేత్ర, శరీర దానంపై అవగాహన



**వరంగల్ వాయిస్, వరంగల్ :** జాతీయ నేత్రదాన దినోత్సవం సందర్భంగా వరంగల్ లోని రామన్నపేట పడిశాల వీరభద్రయ్య మహిళా డిగ్రీ కళాశాలలో మహిళలకు (విద్యార్థినులకు ) నేత్ర, శరీర దానంపై అవగాహన కల్పించారు. తెలంగాణ నేత్ర, అవయవ, శరీర దాతల అసోసియేషన్ అధ్యక్షుడు మల్లారెడ్డి మాట్లాడుతూ నేత్రదానం మహాదానం, మరణానంతరం నేత్రదానం చేస్తే ఇద్దరి అంధులకు చూపునిస్తుందని అన్నారు. భారత దేశంలో కోటి మంది అంధులు ఉంటే, అందులో 20 లక్షల మంది కార్నియా అంధులు ఉన్నారని తెలిపారు. ప్రతి సంవత్సరం 40,000మంది కార్నియా అంధత్వానికి గురవుతున్నారు. ఈ విషయంలో అందరం నేత్రదానంపై అవగాహన కలిగి ఉండి మరణించిన ప్రతి ఒక్కరి నుంచి నేత్ర కార్నియాలను సేకరించి ప్రభుత్వానికి అందజేస్తే కార్నియాంధత్వం సంపూర్ణంగా నివారణవుతుందని అన్నారు. మనం పది అసోసియేషన్ సలహాదారుడు డాక్టర్ రాజేంద్రప్రసాద్ తరగతి గదిలో కళ్లకు నల్ల రిబ్బన్ కట్టుకొని ""ఆక్టివిటీ"" ద్వారా కళ్ళ చూపు లేకపోతే ఎలా ఇబ్బంది జరుగుతుందో పరిశీలించారు. అందుకే మనం సామాజిక బాధ్యతగా తీసుకొని మరణానంతరం నేత్రదానం చేసి మన జీవితాన్ని సార్ధకం చేసుకుందామన్నారు. అనంతరం విద్యార్థినులతో నేత్రదానంపైన ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో కాలేజీ యాజమాన్యం శీతల్, అసోసియేషన్ అధ్యక్షుడు కొండ్రెడ్డి మల్లారెడ్డి, సలహాదారు డాక్టర్ రాజేంద్రప్రసాద్, విద్యార్థినిలు పాల్గొన్నారు.

## అర్హులైన దివ్యాంగులకు న్యాయం చేయాలి



**వరంగల్ వాయిస్, వరంగల్ :** ప్రస్తుతం జరగబోతున్న ఉపాధ్యాయ బదిలీలలో అర్హులైన దివ్యాంగ ఉపాధ్యాయులకు తీవ్రంగా అన్యాయం జరుగుతుందని, జీవో నెం.5లో దివ్యాంగులకు సంబంధించిన కేటగిరీలో దివ్యాంగులకు సదరన్ సర్టిఫికెట్ తో పాటు మెడికల్ బోర్డు సర్టిఫికెట్ కూడా అనుమతి ఇవ్వడాన్ని దివ్యాంగుల ఉపాధ్యాయ సంఘ నాయకులు బిల్లా మహేందర్, మన్నెం చంద్రయ్య, ఆత్మకూరి రామకృష్ణలు తీవ్రంగా ఖండించారు. సదరం బోర్డు సర్టిఫికెట్ గత 2009నుంచి అమలులోకి ఉన్నప్పటికీ కూడా కొందరు దివ్యాంగ ఉపాధ్యాయులు కాలం చెల్లిన మెడికల్ బోర్డు సర్టిఫికెట్లను సబ్మిట్ చేసి ప్రిఫరెన్షియల్ కేటగిరిని వినియోగించే ప్రయత్నం చేస్తున్నారు. దీనివల్ల అర్హులైన సదరం సర్టిఫికెట్ ఉన్న దివ్యాంగులకు తీవ్ర అన్యాయం జరుగుతుందని అన్నారు. కాబట్టి జీవో నెంబర్ 5లో ఉన్న దివ్యాంగుల కాలమ్ లో మెడికల్ బోర్డు సర్టిఫికెట్ అనే పదాన్ని తొలగించి కేవలం సదరం సర్టిఫికెట్ ఉన్న దివ్యాంగులకు మాత్రమే ప్రిఫెన్షియల్ కేటగిరి అర్హత పొందే విధంగా చర్య తీసుకోవాలని ఈ సందర్భంగా ఉపాధ్యాయ సంఘాలు డిమాండ్ చేశాయి. కార్యక్రమంలో దివ్యాంగ ఉపాధ్యాయులు శక్కు, వేంకటేష్, సరళ, అనిత, గౌష్ పాషా, భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

## సీసీ రోడ్డు నిర్మాణం



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** గత 6 మాసాల నుంచి దసరా రోడ్డులో స్మార్ట్ సిటీ కింద వదిలేసిన రోడ్డు నిర్మాణ పనులతో ప్రజలకు, వాహనదారులకు ఎటువంటి ఇబ్బందులు ఉండకూడదనే ఉద్దేశంలో రోడ్డు నిర్మాణం పూర్తి చేశామని 40వ డివిజన్ కార్పొరేటర్ మరుపల్ల రవి అన్నారు. దసరా రోడ్డులో ట్రాన్స్ ఫార్మర్ వద్ద పైప్ లైన్, మురుగు కాలువల వలన సిమెంట్ రోడ్డు వెయలేకపోయినందున వదిలివేసిన స్థలంలో ఎన్నో వాహనదారులు అందులో పడి గాయాల పాలయ్యారని కార్పొరేటర్ మరుపల్ల రవి ఒత్తిడితో కాంట్రాక్టర్లు సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టారు. కార్పొరేటర్ మరుపల్ల రవి దగ్గర ఉండి రోడ్డు నిర్మాణం పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఇంజినీర్ రామినేని గోపాల్, మోహనాజ్ ఖానమ్ లు ఉన్నారు.

## గురువులను సత్కరించిన పూర్వ విద్యార్థులు



**వరంగల్ వాయిస్, కాజీపేట :** పూర్వవిద్యార్థులు తమకు పాఠాలను బోధించిన గురువులను గురువారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా 1984-85 టెన్త్ క్లాస్ పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ టీచర్స్ డే, పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని పురస్కరించుకుని ప్రాథమిక స్థాయిలో పాఠాలను బోధించిన గోపాల్ రెడ్డి, తిరుపతి రెడ్డిలను సత్కరించుకోవడం సంతోషంగా ఉందన్నారు. అనంతరం సన్మాన గ్రహితలైన ఉపాధ్యాయులు మాట్లాడుతూ 38ఏళ్ల క్రితం తాము పాఠాలు చెప్పిన విద్యార్థులు తమను సత్కరించి గురుభక్తిని చాటుకోవడం గొప్ప విషయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు ఎన్. సంపత్, టి.మనోహర్, కోటేశ్వర్, పెరుమాండ్ల సాంబమూర్తి, రేవూరి మురళీధర్ రెడ్డి, జూలూరి రాజు, ఎండీ.రఫీ, ఏ.కుమారస్వామి, జింక సదానందం, జి.రవీందర్, ఎం.శ్రీనివాస్, డి.శ్రీనివాసరావు, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి సీఎంఆర్ఎఫ్ అందజేత



**వరంగల్ వాయిస్, తొర్రూర్ :** మండలంలోని వెంకటాపురం గ్రామానికి చెందిన గుండాల శ్రావణ్ కుమార్ ఇటీవల బైక్ యాక్సిడెంట్ కు గురై నిమ్స్ హాస్పటల్ లో చికిత్స పొందుతున్న విషయం తెలుసుకున్న గ్రామ సర్పంచ్ శీలం లింగన్న గౌడ్ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు దృష్టికి తీసుకెళ్లడంతో వెంటనే మంత్రి స్పందించి చికిత్సకు అవసరమైన రూ. 2,00,000 ఎల్ఓసీని సీఎంఆర్ఎఫ్ నుంచి మంజూరు చేయించి, వారి కుటుంబ సభ్యులకు రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి గ్రామీణ మంచినీటి సరఫరా శాఖల మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అందచేశారు. మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు గ్రామ సర్పంచ్ లింగన్న గౌడ్ కృతజ్ఞతలు తెలిపారు.

## భారత్ జోడో యాత్రకు ఏడాది



**వరంగల్ వాయిస్, వరంగల్ :** ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ జోడో యాత్ర జరిగి ఏడాది పూర్తైన సందర్భంగా వరంగల్ తూర్పు నియోజకవర్గంలోని వెంకట్రామ జంక్షన్‌లోటీపీసీసీ కార్యదర్శి మీసాల ప్రకాష్ స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్ర కన్యాకుమారి నుంచి కాశ్మీర్ దాకా చేపట్టిన పాదయాత్ర విజయవంతమై ఏడాది అయిన సందర్భంగా పెద్ద ఎత్తున స్వీట్లు పంపిణీ చేశామని అన్నారు. సీనియర్ కాంగ్రెస్ నాయకులు సందెల లాజర్, జంగం ప్రభాకర్, ఆకోజు జగన్నాథ చారి, పొన్నాల సంపత్ చారి, ఒంటెల కిరణ్, మేకల సురేష్, పప్పు శ్రవణ్, నాగరాజ్, చంద్రమౌళి, మహిళా కాంగ్రెస్ నాయకురాలు గూడ శారద, దేవసాని కీర్తి పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే అనుచరులకే అన్ని బంధులు

## మాజీ ఎమ్మెల్యే మొలుగూరి భిక్షపతి




**వరంగల్ వాయిస్, పరకాల :** నియోజకవర్గంలో గురువారం లక్ష్మీపురం, హైబోత్ పల్లి, వెంకటాపూర్ గ్రామాలలో మాజీ ఎమ్మెల్యే మొలుగూరి భిక్షపతి ఆధ్వర్యంలో బీజేపీ నాయకుడు డాక్టర్ కాళీ ప్రసాద్ గ్రామ గ్రామాన పరిచయ కార్యక్రమం నిర్వహించారు. గ్రామాలలో కాళీ ప్రసాద్ ప్రచారంతో ప్రజలు భారీగా తమ మద్దతు తెలుపుతున్నారని మాజీ ఎమ్మెల్యే మొలుగూరి భిక్షపతి అన్నారు. లక్ష్మీపురం గ్రామంలో శ్రీ సీతారామాంజనేయ స్వామి ఆలయాన్ని దర్శించి స్వామి వారి ఆశీస్సులు తీసుకోవడం జరిగింది. తదనంతరం సమావేశంలో మాజీ ఎమ్మెల్యే మొలుగురి భిక్షపతి మాట్లాడుతూ గృహలక్ష్మి లబ్ధిదారుల లిస్టును ఎంపీడీవో కార్యాలయంలో అతికించాలని నిజమైన లబ్ధిదారులకు రాకుండా పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి అనుచరులకే కేటాయించడం సిగ్గుచేటని అన్నారు. బీసీ బంధు, దళిత బంధు నియోజకవర్గంలోని ప్రతి కుటుంబానికి అందాలని పలుసార్లు హెచ్చరించిన ఇప్పటివరకు ఎమ్మెల్యే అనుచరులకే ఇచ్చి దళితులను కించపరుస్తారని అన్నారు. లక్ష్మీపురం గ్రామంలో బీసీ సర్పంచిని అవమానపరచడంతో సర్పంచ్ పదవికి రాజీనామా చేశాడని ఎమ్మెల్యేకు బీసీ, ఎస్సీ, ఎస్టీలు అంటే గిట్టదని అన్నారు. రాబోయే ఎన్నికలలో ఎమ్మెల్యే అనుచరులకే సంక్షేమ పథకాలు ఇవ్వడంతో పరకాల నియోజకవర్గం ప్రజలు మొత్తం తిరుగుబాటుకు సిద్ధమయ్యారని, రాబోయే ఎన్నికల్లో ధర్మారెడ్డిని ఎదిరించి బీజేపీ ప్రభుత్వాన్ని గద్దెనెక్కించడం ఖాయమని ప్రజలందరూ బీజేపీ వెంటే ఉన్నారని అన్నారు.

### సంక్షేమ పథకాల పేరుతో భూముల అమ్మకం..

#### డాక్టర్ కాళీ ప్రసాద్

తెలంగాణ రాష్ట్రంలో సంక్షేమ పథకాల పేరు చెప్పి రాష్ట్రంలో విలువగల భూములన్ని ముఖ్యమంత్రి కేసీఆర్ అమ్ముతున్నాడని అన్నారు. ఆ డబ్బులన్ని తమ ఎన్నికల ఖర్చు కోసం కూడ పెట్టుకొని ఎన్నికల్లో ఖర్చు పెట్టేందుకు సిద్ధమయ్యాడని ఎద్దేవా చేశారు. పరకాల నియోజకవర్గంలో ప్రజలు ఎమ్మెల్యేను అసహ్యించుకుంటున్నారని, రాబోయే ఎన్నికల్లో పరకాల నియోజకవర్గంలో బీజేపీ గెలవడం తథ్యమని, ఎవరు ఎన్ని అడ్డంకులు వేసిన పరకాల గడ్డపై కాషాయ జెండా ఎగురుతుందన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ పరకాల రూరల్ అధ్యక్షుడు పుట్ట రవీందర్, శివకుమార్, గొడిసి చిన్న, దండు సురేష్, బాలాజీ మురళి, తిప్పారపు సుధీర్, సల్ప సురేష్, గిరిధర్, వడ్ల మొగిలి, పుట్ట నరేష్, లింగరావు, దుబాసి వెంకటస్వామి, పున్నం అశోక్ పాల్గొన్నారు.

# తెలంగాణ సాయుధ పోరాట చరిత్రను వక్రీకరిస్తున్న బీజేపీ

## 11 నుంచి సాయుధ పోరాట వార్షికోత్సవాలు
## సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు తక్కళ్లపల్లి




**వరంగల్ వాయిస్, వరంగల్ :** తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట చరిత్రను బీజేపీ వక్రీకరించే ప్రయత్నం చేస్తున్నదని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు తక్కళ్లపల్లి శ్రీనివాసరావు అన్నారు. వరంగల్ నగరం శివనగర్ లోని సీపీఐ కార్యాలయం తమ్మెర భవన్ లో సీపీఐ వరంగల్ మండల సమితి సమావేశం దామెర క్రిష్ణ అధ్యక్షతన గురువారం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన తక్కళ్లపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ తెలంగాణ ప్రజల విముక్తి పోరాటంలో బీజేపీ పాల్గొనలేదని, తెలంగాణ సాయుధ పోరాటంలో పాల్గొన్న యోధులను కూడా బీజేపీ గుర్తించలేదన్నారు. నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పోరాడింది కమ్యూనిస్టులు మాత్రమేనని అన్నారు. నాటి తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వార్షికోత్సవాలను ఈ నెల 11 నుంచి ఉమ్మడి జిల్లాలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా జనగామ జిల్లాలో 11 సెప్టెంబర్ ఉదయం 11 గంటలకు నల్ల నరసింహులు విగ్రహం వద్ద జాతా ప్రారంభం కానుందని, సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి దీనిని ప్రారంభించనున్నారని తెలిపారు. అదే రోజు మధ్యాహ్నం 12గంటలకు కామారెడ్డిగూడెం షేక్ బందగి సూపర్ వద్ద, మధ్యాహ్నం 2గంటలకు ధర్మపురం, సాయంత్రం 3.30గంటలకు పాలకుర్తి, సాయంత్రం 5గంటలకు తొర్రూరు మండలం అమ్మాపురంకు చేరుకుంటుందన్నారు. 12 సెప్టెంబర్ ఉదయం 11గంటలకు నెల్లికుదురు, 12.30 గంటలకు మహబూబాబాద్, సాయంత్రం 3.30 గంటలకు నెక్కొండ, సాయంత్రం 4.30గంటలకు నర్సంపేటకు చేరుకుంటుందన్నారు. 13 సెప్టెంబర్ 12.30 గంటలకు వరంగల్, 14 సెప్టెంబర్ ఉదయం 11 గంటలకు భూపాలపల్లి, సాయంత్రం 3.30 గంటలకు పరకాలకు చేరుకుంటుందని, 15 సెప్టెంబర్ న 12.30గంటలకు హనుమకొండ చేరుకొని ముగుస్తుందన్నారు. ఈ సాయుధ పోరాట వార్షికోత్సవాలను జిల్లాలో జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి మేకల రవి, రాష్ట్ర సమితి సభ్యులు పంజాల రమేష్, జిల్లా సహాయ కార్యదర్శి షేక్ బాష్ మియా, నాయకులు గన్నారపు రమేష్, దండు లక్ష్మణ్, గుండె బద్రి తదితరులు పాల్గొన్నారు.

# బీజేపీ కేంద్ర ప్రభుత్వాన్ని గద్దె దించాలి




**వరంగల్ వాయిస్, హనుమకొండ :** కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నుంచి పేదలపై భారాలేస్తూ సంపన్నులకు అనేక రాయితీలు కల్పిస్తున్న కేంద్ర ప్రభుత్వాన్ని గద్దె దించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి బొట్ల చక్రపాణి ప్రజలకు పిలుపునిచ్చారు. నేడు కేంద్ర కమిటీ పిలుపులో భాగంగా అంబేద్కర్ విగ్రహం నుంచి కాళోజి జంక్షన్ వరకు భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా చక్రపాణి మాట్లాడుతూ దేశంలో రోజురోజుకు నిత్యావసర సరుకులైన బియ్యం, పప్పులు, కూరగాయలు, నూనెల ధరలు అద్దు అదుపు లేకుండా పాలకులు పెంచుతున్నారని ఆయన మండిపడ్డారు. పేద ప్రజలు ఉపయోగించే నిత్యావసర సరుకుల ధరలు 2014తో పోలిస్తే నేడు 200శాతంపైగా పెరిగాయని, దీనికి కారణం ఈ వస్తువుల పైన 5 నుండి 18 శాతం పన్నులు వేయటమేనని మండిపడ్డారు. సంపన్నులపై వేసే పన్నును 35 నుంచి 22 శాతానికి తగ్గించారని ఆయన తెలిపారు. ప్రభుత్వ సంస్థలను ఆదానీ, అంబానీ లాంటి అధిపతులకు కారు చౌకగా కట్టబెడుతూ అనేక రాయితీలు కల్పిస్తున్నారని విమర్శించారు. ఉపాధి హామీ పథకానికి నిధులు తగ్గిస్తూ పేదల పొట్ట కొడుతున్నారని ఆయన మండిపడ్డారు. దళిత, గిరిజన, మైనార్టీ లకు కేటాయించిన ఉప ప్రణాళిక నిధులను, సబ్సిడీలను 50శాతం తగ్గించారని తెలిపారు. అలాగే రాష్ట్ర విభజన సందర్భంగా ఇచ్చిన హామీలు కాజీపేట కోచ్ ఫ్యాక్టరీ, బయ్యారం లో ఉక్కు ఫ్యాక్టరీ, ములుగులో గిరిజన యూనివర్సిటీ, రాష్ట్రంలో 3ఎయిర్ పోర్టులు, చేనేతపై జీఎస్టీ తొలగింపు వంటి హామీల ఊసే లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఎన్నికల్లో ఇచ్చిన హామీలైన డబల్ బెడ్ రూమ్ ఇండ్లు, దళిత గిరిజన 3 ఎకరాల భూమి, కాంట్రాక్ట్ కార్మికుల పర్మినెంట్ ,నిరుద్యోగ భృతి ఇలాంటివి ఊసే ఎత్తడం లేదని, కార్మికులు చేస్తున్న సమ్మెల పట్ల అసహనాన్ని ప్రదర్శిస్తున్నాయని ఆయన అన్నారు. పేదలందరికీ పక్కా ఇల్లు, గుడిసె వాసులకు పట్టాలు, ఖాళీ పోస్టులు భర్తీ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. లేకుంటే ఈ పాలకులను ప్రజలు గద్దె దించాలని ఆయన ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు సారంపల్లి వాసుదేవరెడ్డి, జి ప్రభాకర్ రెడ్డి, టి.ఉప్పలయ్య, జిల్లా కమిటీ సభ్యులు వంకుడోత్ వీరన్న, మంద సంపత్ , ఎల్ దీప, నాయకులు కిషోర్ కుమారస్వామి, కొమురెల్లి, జయశ్రీ , రవీందర్, రాజేందర్, రాజు, లింగమూర్తితో పాటు 500మంది పాల్గొన్నారు.

# ఎర్రబెల్లి స్వర్ణ దంపతులపై విమర్శలు తగవు



**వరంగల్ వాయిస్, పర్వతగిరి :** నేడు పర్వతగిరి మండలం దౌలత్ నగర్ గ్రామంలో పర్వతగిరి మండల నాయకులు మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో మండల సీనియర్ నాయకులు అబ్బపురి వెంకటేశ్వర్లు, ఎంపీటీసీ మాలోతు కాంతమ్మ, లాలునాయక్ లు మాట్లాడుతూ పర్వతగిరి మండలంలో అనిల్ రావు అనే వ్యక్తి వల్ల పర్వతగిరి మండల కార్యకర్తలకు తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. పార్టీకి జిల్లా నాయకత్వానికి వ్యతిరేకంగా మాట్లాడితే ఊరుకునే వారు ఎవరూ లేరని అన్నారు. మీ వ్యక్తిగత స్వలాభం కోసం కొత్త నాయకులు వస్తే పాతవారిని విడిచిపెట్టి అమ్ముడుపోయే నాయకులు గత 40ఏళ్లుగా కాంగ్రెస్ పార్టీ కోసం పార్టీ సిద్ధాంతాల కోసం పనిచేస్తున్న ఎర్రబెల్లి స్వర్ణ దంపతులను విమర్శించే స్థాయి మీలాంటి అమ్ముడుపోయే నాయకులకు లేదని అన్నారు. గత ఎన్నికలలో మీరు చేసిన మోసాలు మండల ప్రజలందరికీ తెలుసన్నారు. అనిల్ రావు అనే వ్యక్తి వల్ల మండలంలో పార్టీకి నష్టం జరుగుతుందని, అలాంటి వ్యక్తిపై జిల్లా నాయకత్వం రాష్ట్ర నాయకత్వం చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. దయాకర్ రావుకు సన్నిహితంగా ఉన్న వ్యక్తికి మండల అధ్యక్షుడి పదవీ ఇచ్చి పార్టీ ఎంతో నష్టపోయిందని ఆవేదన చెందారు. పార్టీ అభివృద్ధి చెందాలంటే ఇలాంటి అమ్ముడుపోయే నాయకులను పక్కనపెట్టి పార్టీ కోసం పనిచేసే నాయకులను ప్రోత్సహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో దౌలత్ నగర్ గ్రామం ఎంపీటీసీ మాలోత్ కాంతమ్మ లాలు నాయక్, జిల్లా కిసాన్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు ఆడెపు కుమారస్వామి, గ్రామ పార్టీ అధ్యక్షుడు కత్తుల వెంకన్న, జిల్లా యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి పుల్లూరి దిలీప్, సోషల్ మీడియా ఇంచార్జి ఎర్రబోయిన సాంబరాజు యాదవ్, యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కత్తుల శ్రీనివాస్ యాదవ్, మాలోతు శ్రీనివాస్, మండల యూత్ కాంగ్రెస్ నాయకుడు నీరటి ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు.

# చేప పిల్లల పంపిణీతో మత్స్యకారుల జీవితాల్లో వెలుగులు



**వరంగల్ వాయిస్, పర్వతగిరి :** మత్స్యకారుల కుటుంబాలను ఆర్థికంగా బలోపేతం చేయాలనే ఉద్దేశ్యంతో ముఖ్యమంత్రి కేసీఆర్ ఉచిత చేప పిల్లల పంపిణీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని బీఆర్ఎస్ పార్టీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు, వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేష్ అన్నారు. పర్వతగిరి మండలం అన్నారం చెరువులో ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు చేసి రూ.35000 విలువ గల 45000వేల ఉచిత చేప పిల్లలను వదిలారు. అనంతరం ముదిరాజ్ కమ్యూనిటీ హాల్ భవన నిర్మాణానికి సంబంధించిన 10 లక్షల ప్రొసీడింగ్ కాపీని గ్రామస్తులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వ హయాంలో మత్స్య కార్మికుల కష్టాలు తీరాయని వారు ఆర్థికంగా ఎదిగాలని, డబ్బులు పెట్టి చేపపిల్లలను పెంచే స్తోమత లేని వారికి వంద శాతం సబ్సిడీతో ఉచితంగా చేప పిల్లలను పంపిణీ చేస్తున్న ఏకైక ముఖ్యమంత్రి కేసీఆర్ మాత్రమేనని తెలిపారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా తెలంగాణ రాష్ట్రంలో మాత్రమే చేప పిల్లల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మత్స్య కార్మికుల కోసం సొసైటీ ఏర్పాటు చేసి హక్కులు కల్పించిన ఏకైక రాష్ట్రం కూడా తెలంగాణ రాష్ట్రమేనని అన్నారు. చేప పిల్లల పెంపకం ద్వారా మత్స్యకారుల జీవితాల్లో వెలుగులు నిండాయని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా సాయి తిరుపతి రెడ్డి జన్మదిన వేడుకలు



**వరంగల్ వాయిస్, పరకాల :** పట్టణ బీఆర్ఎస్ పార్టీ నాయకుడు చందుపట్ల సాయితిరుపతి రెడ్డి జన్మదిన వేడుకలను ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ పాలకవర్గం సభ్యులు, బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# కాపుల కుంభస్థలం

# 'కంభం'పాటి కుమారస్వామి



"మాట జారితే గొడవలు పెరుగుతాయి. పొదుపుగా మాట్లాడితే బంధాలు బలపడుతాయి." అనేది వరంగల్ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రి పూర్వ అధ్యక్షులు **కంభంపాటి కుమారస్వామి** ఫిలాసఫీ. స్వయంగా ఉన్నత శ్రీ విద్యావంతుడు కావడంతో ఆయనకు మంచిచెడుల విచక్షణ పరిధులు తెలుసు. వరంగల్ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీకి రెండు పర్యాయాలు (నాలుగు సంవత్సరాలు) ఏకగ్రీవ అధ్యక్షుడిగా సేవలందించిన ఆయన ఏ సందర్భంలోనూ ఎవరిని ఇబ్బంది పెట్టలేదు. నిత్యం ఎంతో పని ఒత్తిడి, లెక్కకు మించిన సమస్యలు, తగవులు తీర్చమని వచ్చే బాధితుల తాకిడి సర్వసాధారణమైన చాంబర్లో ఆయన ఎంతో హుందాగా వ్యవహరించారు. ప్రెసిడెంట్ సీటులో కూర్చున్న తాను. అందరికీ ఆదర్శంగా ఉండాలని పరితపించారు. తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన ప్రతి ఒక్కరికీ జవాబుదారిగా వ్యవహరించాలని గట్టిగా నమ్మి అందుకు అనుగుణంగా నడుచుకున్నారు.

- గడ్డం కేశవమూర్తి

గొడవలు పరిష్కారం కాదుకదా.., సామరస్యంగా మెదిలితే అన్నీ అవే తీరుతాయని చాంబర్లో వచ్చిన ప్రతి సమస్య సందర్భంలో ఆయన సూచించారు. ఆయనను అంతర్గతంగా విభేదించిన వారితో కూడా సౌమ్యంగా మెదులుతూ, చిరునవ్వుతో సమస్య తీవ్రతను ఉధృతం కాకుండా చూసి పరిష్కారం దిశగా పావులు కదిపిన ఔన్నత్యం కంభంపాటి సొంతం. తనకు గిట్టని వారు సలహాలు ఇచ్చిన స్వీకరించి, మంచిచెడులు ఆలోచన చేసుకుని అమలుకు వెనకాడని ఉదార వ్యక్తి కుమారస్వామి.

## ఆకట్టుకునే వ్యక్తిత్వం..

తనకున్న మంచిపేరును ఎల్లవేళలా కాపాడుకుంటే చాలనే వ్యక్తిత్వం కంభంపాటి కుమారస్వామిది. ఈ పోటీ ప్రపంచంలో ఒక పదవికి ఎంత కాంపిటీషన్ ఉంటుందో ప్రత్యక్షంగా చూస్తేనే అర్థమవుతోంది. అలాంటి చాంబర్ అధ్యక్ష స్థానానికి ఎంత బాధ్యత ఉందో చెప్పాల్సిన అవసరం లేదు. అంతటిగొప్ప స్థానాన్ని ఆయనకు చాంబర్ సభ్యులంతా రెండు పర్యాయాలు ఏకగ్రీవంగా కట్టబెట్టారంటేనే ఆయన వ్యక్తిత్వం ఎంత హుందాగా ఉందో తెలుసుకోవచ్చు. మూడో పర్యాయం కూడా ఆయనను ఏకగ్రీవంగా ఎన్నుకోవడానికి ఒత్తిడి పెంచినా తనకున్న కుటుంబ భారాలు, ఇతరత్రా సమస్యలతో సున్నితంగా తిరస్కరించి తన హుందాతనాన్ని చాటుకున్నారు.



## ఆలయాలు దత్తత..

కంభంపాటి కుమారస్వామికి సమాజసేవతోపాటు ఆద్యాత్మిక చింతన ఎక్కువే. ముందునుంచి ఆయన స్వయంగా శ్రీసాయిబాబాకు పరమభక్తుడు. అందుకే ఆయన ఇంట్లోకి ప్రవేశించే ప్రధాన ద్వారానికి కూడా సాయిబాబా ఫొటోనే అలంకరించారు. హనుమకొండ యాదవనగర్లోని శ్రీ సాయిబాబా ఆలయానికి అన్నీ తానై చూసుకుంటున్నారు. ఆలయకమిటీ వేయడం నుంచి ప్రతి చర్యలో ఆయన ప్రమేయం తప్పకుండా ఉంటుంది. స్వామి కార్యాలకు, ఆలయ అవసరాలకు ఆర్థికపరమైన ఏర్పాట్లు చేయించారు. దీనితోపాటు వరంగల్ కొత్తవాడలోని శ్రీ ఆంజనేయ స్వామి ఆలయ అభివృద్ధికి కూడా తనవంతుగా సహాయ సహకారాలు అందిస్తున్నారు.



### ప్రొఫైల్

**పేరు :** కంభంపాటి కుమారస్వామి
**హొదా :** పూర్వ అధ్యక్షుడు, వరంగల్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ
**పుట్టిన తేదీ :** 25-11-1954
**స్వగ్రామం :** ములుగు
**విద్యార్హత :** ఎమ్మెస్సీ (బాటని)
**తల్లిదండ్రులు:** చంద్రమ్మ - సాంబయ్య ( పట్వారి)
**కుటుంబం : సతీమణి - కుమార్తెలు:** అవంతి-అర్చన
**నిర్వహించిన పదవులు :**
2007 నుంచి 2011 వరకు వరంగల్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీకి అధ్యక్షుడిగా సేవలందించారు.
2005లో వరంగల్ వ్యవసాయ మార్కెట్ కమిటీలో మున్నూరు కాపు పరపతి పొదుపు సంఘాన్ని స్థాపించి దానికి గౌరవాధ్యక్షుడిగా నేటికీ కొనసాగుతున్నారు.





## నాన్నే స్ఫూర్తి..

కంభంపాటి కుమారస్వామికి నాన్నే స్ఫూర్తి, ఒక్కమాటలో చెప్పాలంటే తండ్రి సాంబయ్య పంచిన భిక్షతోనే ఇంతటి స్థాయిలో ఉన్నానని ప్రతిక్షణం గుర్తు చేసుకుంటుంటారు. ఆయన తండ్రి మొదట పట్వారీగా పనిచేసినా, వ్యవసాయం మీద మక్కువతో సాగుపైనే దృష్టి సారించారు. తన నలుగురు కుమారులు, ఓ కూతురుకు బంగారు భవిష్యత్ అందివ్వడానికి అహర్నిశలు కష్టపడ్డారు. పిల్లల ఎదుగుదలకు చక్కని ప్రణాళికతో ఉన్నత చదువులు చదివించారు.

## కులస్తుల ఐక్యతకు కృషి..

మున్నూరు కాపులను ఐక్యం చేయడంలో కంభంపాటి కుమారస్వామి ఎంతో చొరవ తీసుకున్నారు. వరంగల్ ఏనుమాముల వ్యవసాయ మార్కెట్లో మెజారిటీ వర్గంగా ఉన్న మున్నూరు కాపులకు చాంబర్లో సరైన ప్రాధాన్యం లేని విషయమై తీవ్రంగా ఆలోచించారు. చాంబర్లో వారికి కూడా సరైన గుర్తింపు వచ్చేందుకు అప్పటి చాంబర్ అధ్యక్షుల ముందు ప్రపోజల్ పెట్టారు. దానికి వారు తొలుత ససేమిరా అన్నా, కాలక్రమేణా కంభంపాటి కుమారస్వామి ఆలోచన సరైనదే అనే నిర్ణయానికి వచ్చి మున్నూరు కాపులకు చాంబర్ లో తగిన ప్రాతినిధ్యం కల్పించారు. కులస్తులందరినీ ఒక్కటి చేయడానికి ఆయన 2005లో మున్నూరు కాపు పరపతి సంఘాన్ని ఏర్పాటు చేశారు. అందులో వ్యవసాయ మార్కెట్లో పనిచేసే మున్నూరు కాపులందరికీ అవకాశం కల్పించారు. సంఘాన్ని నేటికీ ఆయనే వెనకుండి నడిపిస్తున్నారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు మున్నూరుకాపు పరపతి సంఘం గౌరవ అధ్యక్షులుగా కంభంపాటే కొనసాగుతున్నారు.









## చాంబర్లో చెరగని ముద్ర...

చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీలో కంభంపాటి కుమారస్వామిది ఓ చరిత్రే. తెలంగాణ ఉద్యమం ఎగసిపడుతున్న.. సందర్భంలో అధ్యక్షుడిగా కొనసాగిన ఆయన ఎక్కడా ఇబ్బందికరంగా ఫీల్ అయిన సందర్భాలు లేవు, నాటి ఉద్యమ నేత, నేటి ముఖ్యమంత్రి కేసీఆర్ పిలుపు మేరకు తనవంతు సహాయ, సహకారాలు అందించారు. ఉద్యమంలో పాల్గొనే ప్రతి ఒక్కరికీ ఆర్థికంగా, ఇతరాత్ర సహాయం చేశారు. ఆయన వ్యక్తిత్వం, శాంతస్వభావం మెచ్చి చాంబర్ సభ్యులంతా మూడో సారి కూడా ఏకగ్రీ వంగా అధ్యక్షు డిగా కొనసా గాలని కోరినా .. ఆయన సుతి మెత్తగా తిర స్కరిం చారు. చాంబర్లో ఎలాంటి రాజకీయాలకు అవకాశాలు లేకుండా, ఏదైనా సమస్య ఉంటే అప్పటికప్పుడుగా, మరీ జఠిలమైనదైతే సరైన సమయం వచ్చే వరకు ఎదురు చూసైనా పరిష్కారం లభించేలా చూశారు. కొందరు ఆయనను కవ్వింపు చర్యలకు ఉసిగొల్పినా ఎక్కడా నిగ్రహాన్ని కోల్పోక తనదైన వ్యక్తిత్వంలో అధ్యక్ష సీటుకు ఎనలేని గౌరవాన్ని తీసుకొచ్చారు. ముఖ్యంగా వరంగల్ చాంబర్ లో మున్నూరు కాపు కులస్తులకు ప్రాధాన్యం లేదని గుర్తించిన ఆయన అందుకోసం అందరినీ ఒప్పించడానికి తీవ్రంగా శ్రమించారు. ముందుగా కులస్తుల్లో ఐక్యత దిశగా కృషి చేసి ఒక్కతాటిపైకి తెచ్చారు. అందులో భాగంగానే మున్నూరు కాపు కులస్తుల పరపతి సంఘాన్ని స్థాపించారు. సంఖ్యాబలం ఉన్నా.. జరుగుతున్న అన్యాయాన్ని అందరికీ తెలియజెప్పి చాంబర్ లో ప్రాతినిధ్యం కల్పించేలా కృషి చేశారు.రి

## మార్కెట్లో ఆయనది ఓ చరిత్రే..

ఏనుమాముల వ్యవసాయ మార్కెట్లో కంభంపాటి కుమారస్వామిది ఓ చరిత్రగానే అభివర్ణించాలి. ఆయన అధ్యక్షుడిగా కొనసాగిన సమయంలో కీలకమైన పరిణామాలు చోటు చేసుకున్నాయి. ముఖ్యంగా అడ్తిదారు వ్యవస్థ రద్దు సమయంలో ఆయన వ్యవహరించిన తీరు మాటల్లో వర్ణించలేనిది. ముఖ్యమంత్రి వైఎస్ఆర్ సర్కార్ తీసుకొచ్చిన సదరు జీవోతో ఆందోళనకు గురైన అడ్తిదారులకు కంభంపాటి అండగా నిలిచారు. ప్రభుత్వ పెద్దలను కలిసి అడ్తి వ్యవస్థ గురించి వివరించి జీవోను ఉపసంహరించుకునేలా చేశారు. అలాగే అడ్తిదారులను వ్యాట్ పరిధిలోకి తీసుకొస్తూ విడుదలైన జీవోను కూడా రద్దు చేయించడంలో కేకే చాకచక్యంగా వ్యవహరించారు. అప్పటి ఎమ్మెల్యేలు కొండా సురేఖ, బస్వరాజు సారయ్య, ఎమ్మెల్సీ కొండా మురళీధర్ రావు తదితర ప్రజాప్రతినిధులతో ప్రభుత్వ బాధ్యులతో చర్చలు జరిపి వ్యాట్ నుంచి అడ్తిదారులకు మినహాయింపు లభించేలా ఉత్తర్వులు ఇప్పించారు.

## ఉద్యోగం, వ్యాపారం..

కంభంపాటి కుమారస్వామి ఎమ్మెస్సీ (బాటనీ) పూర్తి చేసిన తర్వాత సుమారు మూడు నెలల పాటు, వరంగల్ లోని మహబూబియా పంజతన్ జూనియర్ కాలేజీలో బాటనీ లెక్చరర్ గా విధులు నిర్వహించారు. కానీ అది ఆయనకు నచ్చకపోవడంతో ఉద్యోగాన్ని వదిలి వ్యాపారం వైపు మళ్లారు. అందులో భాగంగానే ములుగులో శ్రీ సాంబశివ ఫర్టిలైజర్ షాపును ప్రారంభించారు. 1980 నుంచి 1990 వరకు పదేళ్ల పాటు అక్కడే దుకాణం నడిపారు. అది రన్నింగ్ ఉండగానే 1990లో మమత ట్రేడర్స్ పేరుతో అడి వైపు అడుగులు వేశారు. వరంగల్ చాంబర్ మాజీ అధ్యక్షులు కటకం పెంటయ్యతో భాగస్వామిగా అడిదుకాణాన్ని నడుపుతూనే చాంబర్ వ్యవహారాల్లో చురుగ్గా పాల్గొన్నారు. సుమారు పదిహేను సంవత్సరాలు అడి వ్యాపారం నడుపుతూనే 2000 సంవత్సరంలో మల్లీశ్వరా కోల్డ్ స్టోరేజ్ని స్థాపించారు. అనంతరం 2005లో కాటన్ వ్యాపారం వైపు దృష్టి మళ్లించారు. ఈ క్రమంలోనే 2007 నుంచి 2011 వరకు చాంబర్ అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికై రెండు పర్యాయాలు పనిచేశారు. తనదైన మార్కుతో సేవలందించి చాంబర్ను ఉన్నత శిఖరాలకు తీసుకెళ్లారు.

# శ్రీకృష్ణుడి జీవన విధానం ఆదర్శ మార్గం



## చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** శ్రీకృష్ణుని జీవన విధానం ఆదర్శ మార్గమని, సకల జనులకు గొప్ప స్ఫూర్తి ప్రదాత శ్రీకృష్ణుడని ప్రభుత్వ చీఫ్ విప్, పశ్చిమ శాసనసభ్యుడు దాస్యం వినయ్ భాస్కర్ అన్నారు. కుడా చైర్మన్ సంగం రెడ్డి సుందర్ రాజ్ యాదవ్ ఆధ్వర్యంలో యాదవ్ నగర్ లోని ఏజీఆర్ గార్డెన్ లో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు నిర్వహించగా ముఖ్యఅతిథిగా హాజరై చీఫ్ విప్ మాట్లాడారు. అన్ని వర్గాల అభ్యున్నతిని కోరుకునే వారు యాదవులని అన్నారు. నిజాయితీకి నీతికి మారుపేరు యాదవులని కొనియాడారు. శ్రీకృష్ణ జన్మాష్టమిని కోలాహలంగా జరుపుకోవడం సంతోషదాయకమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కుడా చైర్మన్ సంగం రెడ్డి సుందర్ రాజ్ యాదవ్ మాట్లాడుతూ శ్రీకృష్ణుని మార్గం అనుసరణీయమని అన్నారు. యువత, ప్రజలు సన్మార్గంలో నడవడానికి భగవద్గీత తోడ్పడుతుందని తెలిపారు. యాదవులందరూ ఒకచోట చేరి శ్రీకృష్ణాష్టమి జరుపుకోవడం ఎంతో సంతోషదాయకమని అన్నారు. చిన్నారుల శ్రీకృష్ణ గోపిక వేషధారణలు ఆకట్టుకున్నాయి. సాంస్కృతిక కార్యక్రమాలు ప్రజలను ఆహుతులను అలరించాయి. కార్యక్రమం చివరిలో చిన్నారులు ఉట్టి కొట్టారు. కార్యక్రమంలో నాలుగో డివిజన్ కార్పొరేటర్ బొంగు అశోక్ యాదవ్, రవి యాదవ్, సహదేవ్ యాదవ్, వంశీయాదవ్, బలరాం యాదవ్, శ్యామ్ యాదవ్, రాకేష్ యాదవ్, నాగరాజు యాదవ్, రాజుయాదవ్, భిక్షపతి యాదవ్, మహిళలు యువత పాల్గొన్నారు.

## జంగా రాఘవ రెడ్డి పాదయాత్ర



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ జోడో యాత్ర మొదటి వార్షికోత్సవం సందర్భంగా గురువారం సంఘీభావంగా 9వ డివిజన్ వేయి స్తంభాల గుడి నుంచి అంబేద్కర్ జంక్షన్ వరకు మాజీ డీసీసీబీ చైర్మన్ జంగా రాఘవ రెడ్డి యాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా జంగా మాట్లాడుతూ ద్వేషం వద్దు..దేశం ముద్దు అని, దేశంలో పెరుగుతున్న మతోన్మాదంతో పాటు అసమానతలకు వ్యతిరేకంగా దేశ ప్రజల గళం వినిపించేందుకు రాహుల్ గాంధీ చేపట్టిన భరత్ జోడో యాత్ర 1 సంవత్సరం పూర్తి చేసుకున్న సందర్భంగా ఇవే మా శుభాభివందనాలు అని అన్నారు. భారత్ జోడో యాత్ర సెప్టెంబర్ 7-2022న మొదలైన పాదయాత్ర కన్యాకుమారి నుంచి కాశ్మీర్ వరకు 146రోజులు 4080కిలోమీటర్లు నడిచి ప్రజల కష్టాలు, బాధలు తెలుసుకొని దేశ చరిత్రలో ఒక నూతన అధ్యాయాన్ని సృష్టించిన కాంగ్రెస్ అగ్ర నాయకుడు రాహుల్ గాంధీకి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు, యూత్ కాంగ్రెస్ నాయకులు, మహిళలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

## రాజీ మార్గమే రాజ మార్గం

### భూపాలపల్లి జిల్లా ఎస్పీ పుల్లా కరుణాకర్



వరంగల్ వాయిస్, భూపాలపల్లి : ఈనెల 9వ వరకు జరిగే జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమంలో రాజీ పడదగిన క్రిమినల్, సివిల్ కేసులతో పాటు, భూ తగాదా, చిట్‌ఫండ్, రోడ్డు ప్రమాద, వివాహ, కుటుంబ తగాదాలతో పాటు ట్రాఫిక్ కేసులకు సంబంధించి డ్రంకెన్ డ్రైవ్, మైనర్ డ్రైవింగ్, లైసెన్స్ లేకుండా డ్రైవింగ్ కేసులు, వివిధ కేసులను రాజీమార్గంలో పరిష్కరించుకోవాలని జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఎస్పీ పుల్లా కరుణాకర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వివాదాలు అనేవి పెంచుకోవాలనుకుంటే జీవితకాలం కొనసాగుతాయని,రాజీమార్గమే రాజమార్గమని ఎస్పీ పేర్కొన్నారు. లోక్ అదాలత్ లో సామరస్య ధోరణితో రాజీ పడదగిన వివిధ కేసులపై న్యాయస్థానాల చుట్టూ తిరుగకుండా కేసులు పరిష్కారం చేసుకోవాలని ఎస్పీ కరుణాకర్ సూచించారు. క్షణికావేశంలో భార్యాభర్తల మధ్య అన్నదమ్ముల మధ్య జరిగిన వివాదాలను సామరస్య పూర్వకంగా పరిష్కరించుకోవాలని, అలాగే ఒకే గ్రామంలో నివాసం ఉండేవారు కేసులతో గొడవలు పెంచుకోవద్దని రాజీమార్గం ద్వారా సఖ్యతగా ఉండాలని, జాతీయ లోక్ అదాలత్ ను సద్వినియోగం చేసుకోవాలని ఎస్పీ కోరారు.

# దేశాన్ని ఐక్యం చేసిన భారత్ జోడో యాత్ర

**వరంగల్ వాయిస్, శాయంపేట :** కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ జోడో యాత్ర భారతదేశ ప్రజల మనసులో చెరగని ముద్ర వేసిందని దేశాన్ని మరింత ఐక్యం చేసిందని కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు దూదిపాల బుచ్చిరెడ్డి అన్నారు. గురువారం రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ జోడోయాత్ర నేటికీ సంవత్సరం పూర్తైన సందర్భంగా ఏఐసీసీ, పీసీసీ ఆదేశం మేరకు శాయంపేట కాంగ్రెస్ మండల కమిటీ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నుంచి గాంధీ చౌక్ మీదుగా అంబేద్కర్ విగ్రహం వరకు పాదయాత్ర చేశారు. ఈ సందర్భంగా బుచ్చిరెడ్డి మాట్లాడుతూ రాహుల్ గాంధీ చేసిన భారత్ జోడో యాత్ర దేశంలోనే ఏ రాజకీయ నాయకులు చేయని సుదీర్ఘమైన సాహసోపేతమైన పాదయాత్ర అని అన్నారు. సుమారుగా 145 రోజులపాటు 4801 కిలోమీటర్ల జోడో యాత్ర చేసి లక్షలాదిమంది ప్రజల మనసులో చెరగని ముద్ర వేశారని తెలిపారు. ఈ యాత్ర దేశంలోని ప్రజల ప్రధాన సమస్యలైన ధరల పెరుగుదల నిరుద్యోగం అవినీతి ప్రభుత్వాల దోపిడి విభజన మతతత్వ రాజకీయాల గురించి ప్రభుత్వాలను ప్రశ్నించడం జరిగిందన్నారు. ఆయన చేపట్టిన జోడో యాత్ర మనదేశ భిన్నత్వంలో ఏకత్వాన్ని మరింత పటిష్టం చేసిందని, పేద మధ్యతరగతి ప్రజల సమస్యల పరిష్కారానికి భరోసా కల్పించి నమ్మకాన్ని ఇచ్చిందన్నారు. భారత్ జోడో



యాత్ర పూర్తైన తర్వాత కర్ణాటక రాష్ట్రంలో ప్రజలు కాంగ్రెస్ పార్టీకి విజయం సాధించి పెట్టారని, రాబోయే ఎలక్షన్లలో ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను గద్దె దింపి కాంగ్రెస్ పార్టీకి ప్రజలు పట్టం కడతారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల నాయకులు చిందం రవి, ఎండీ హైదర్, వైనాల కుమారస్వామి, మామిడిపల్లి సాంబయ్య, నిమ్మల రమేష్, రఫీ, లడే రాజ్ కుమార్, నాగరాజు, జంగారెడ్డి, వెంకటరాజు రెడ్డి, రాజు, నరేష్ రెడ్డి, ప్రపంచ రెడ్డి, చిరంజీవి, కటయ్య, పల్లెబోయిన శ్రీనివాస్, చంద్రమౌళి, సుకుమార్, పత్తి శీను, సదయ్య, వెంకటేశ్వర్లు, సుధాకర్, కుక్కల రాము, కొమ్ముల విష్ణు పాల్గొన్నారు.

## కాశిబుగ్గలో కృష్ణాష్టమి వేడుకలు



**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** బిట్స్ అస్మాక హై స్కూల్ లో ఘనంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో బాలాజీ విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ ఏ.రాజేంద్ర ప్రసాద్ రెడ్డి , సెక్రటరీ రాజేశ్వర్ రెడ్డి పాల్గొని కృష్ణాష్టమి విశిష్టతను వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ సంతోష్ ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## పొడిచెట్టి రెసిడెన్సీలో..



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** నయీంనగర్ లోని పొడిచెట్టి రెసిడెన్సీలో కృష్ణాష్టమి వేడుకలు వైభవంగా నిర్వహించారు. నిర్వాహకురాలు పొడిచెట్టి వరలక్ష్మీ కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. పిల్లలకు చిన్నప్పటి నుంచే పర్వదినాల ప్రాశస్త్యం, సంస్కృతి సాంప్రదాయాలను తెలపాల్సిన అవసరం తల్లిదండ్రుల మీద ఉందన్నారు. అందుకు అనుగుణంగా మా రెసిడెన్సీలో కృష్ణాష్టమి వేడుకలను నిర్వహించి పిల్లలను, తల్లిదండ్రులను చైతన్య వంతులను చేస్తున్నట్లు తెలిపారు. పిల్లలు విభిన్న రూపాల్లో కృష్ణుని వేషధారణలో హాజరై చూపరులను ఆకట్టుకున్నారు. కనీసం రెండు సంవత్సరాలు నిండని మల్లు శివరామకృష్ణ పవన్ అనే బుడ్డోడు శ్రీ కృష్ణుని వేషధారణలో హైలైట్ గా నిలిచాడు. పిల్లలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో పిల్లలతో పాటు రెసిడెన్సీలోని వేణుగోపాల్, కనకలక్ష్మీ, మానస, తారాచంద్, శ్రీనివాస్, తరుణ్ తదితరులు పాల్గొన్నారు.

## ఉట్టి కొట్టిన విజేతలకు పారితోషికం



**వరంగల్ వాయిస్, కాటారం:** కాటారం మండలంలో శ్రీ కృష్ణుని జన్మాస్టమి వేడుకల సందర్భంగా యాదవ్ సంఘానికి కాటారం సర్పంచ్ తోట రాధమ్మ రూ.4016, పెద్దపల్లి జడ్పీ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు ఉట్టి కొట్టిన వారికి బహుమతిగా రూ.6016 ప్రకటించారు. ఈ మేరకు కాటారం సర్పంచ్ తోట రాధమ్మ చేతుల మీదుగా యాదవ్ సంఘానికి, విజేతలకు పారితోషికం అందజేశారు. యాదవ్ సంఘం వారు కృతజ్ఞతలు తెలిపారు.

## సెయింట్ థామస్ హైస్కూల్‌లో..



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** కృష్ణాష్టమి పండుగ సందర్భంగా గురువారం సెయింట్ థామస్ హై స్కూల్ లో కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ జే.మనోహర్ మాట్లాడుతూ విద్యార్థిని విద్యార్థులు గోపిక, శ్రీ కృష్ణుని ఆదర్శంగా తీసుకుని ఉన్నతంగా ఎదగాలని ఆకాంక్షించారు. విద్యార్థులు శ్రీకృష్ణా వేషధారణలో వచ్చి ఉట్టి కార్యక్రమంలో పాల్గొని ఆటపాటలతో అందరిని ఆకట్టుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో స్కూల్ సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులపైనే దాడులా?



**అక్రమాలపై ప్రశ్నిస్తే కాళ్లు, చేతులు విరగ్గొడతారా ..**

**బాధ్యులందరినీ వెంటనే సస్పెండ్ చేయాలి ..**

**బీజేపీ నేత గంట రవికుమార్**

**విద్యార్థులకు అండగా నిలిచిన బీజేపీ, విద్యార్థి సంఘ ప్రతినిధులు**

**వరంగల్ వాయిస్, కేయూ :** కాకతీయ యూనివర్సిటీ పీహెచ్ డి కేటగిరి 2 అడ్మిషన్లలో అక్రమాలు జరిగాయని విద్యార్థులు ప్రశ్నిస్తే.. పోలీసులు విచక్షణారహితంగా కొట్టి కాళ్లు, చేతులు విరగొట్టడం సిగ్గుచేటని బీజేపీ వరంగల్ తూర్పు యువనేత గంట రవికుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థులపై పోలీసుల దాడిని నిరసిస్తూ గురువారం ఆయన కేయూను సందర్శించి గాయపడిన విద్యార్థులతో మాట్లాడారు. పీహెచ్ డీ అడ్మిషన్ల లో అవకతవకల పై విచారణ జరపి దోషులను శిక్షించాలని డిమాండ్ చేశారు. అంతేకాకుండా తప్పుడు రిపోర్టులు సమర్పించి కోర్టును సైతం తప్పుదోవ పట్టించాలని చూశారని మండిపడ్డారు. ఆందోళన చేస్తున్న విద్యార్థులను పోలీసులు అక్రమంగా అరెస్టు చేసి టాస్క్ ఫోర్స్ స్టేషన్ కు తీసుకెళ్లి విచక్షణ రహితంగా కొట్టి కాళ్లు చేతులు విరగొట్టడం దుర్మార్గం అన్నారు. ఇదేనా ఫ్రెండ్లీ పోలీసింగ్ అంటూ ప్రశ్నించారు. దీనికి ప్రభుత్వం నైతిక బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. విద్యార్థులను కొట్టిన పోలీసులందరినీ వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. వారికి మెరుగైన వైద్యం అందించాలని స్పష్టం చేశారు. అధికారాన్ని అడ్డం పెట్టుకొని బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజల్ని భయభ్రాంతులకు గురి చేస్తోందని ఆరోపించారు. కేసీఆర్ దుర్మార్గ పాలనకు ప్రజలు చరమగీతం పాడే సమయం ఆసన్నమైందని అన్నారు.

## బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఏనుగుల రాకేష్ రెడ్డి ..

కాకతీయ యూనివర్సిటీలో కేయు జేఏసీ ఐక్య విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దీక్షకు బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఏనుగుల రాకేష్ రెడ్డి, బీజేపీ హనుమకొండ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా రాకేష్ రెడ్డి మాట్లాడుతూ పాఠాలు చెప్పాల్సిన వీసి తాటికొండ రమేష్ కేటీఆర్ సృజనాత్మక మీద వ్యాసాలు రాస్తున్నారని మండి పడ్డారు. యూనివర్సిటీ భూములు మాయం చేస్తుంటే టాస్క్ ఫోర్స్ ను ఎందుకు దించడం లేదని ప్రశ్నించారు. విద్యార్థులకు ఎటువంటి ఆపద వచ్చిన అండగా నిలుస్తానంటూ రాకేష్ రెడ్డి ప్రకటించారు.

## బీజేపీ హనుమకొండ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ..

కాకతీయ యూనివర్సిటీ పీహెచ్ డీ అడ్మిషన్లలో జరిగిన అవకతవకలపై శాంతియుతంగా నిరసన తెలియజేస్తున్న ఏబీవీపీ నాయకులను, విద్యార్థులను అరెస్టు చేసి టాస్క్ ఫోర్స్ పోలీసుల విచక్షణరహితంగా కొట్టడంపై బీజేపీ హనుమకొండ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ మండిపడ్డారు. గాయపడిన కేయూ విద్యార్థి నాయకులను గురువారం యువమోర్చ అధ్యక్షులు తీగల భరత్ గౌడ్ తో కలిసి పరామర్శించారు.

## జాక్ నిరసన దీక్ష..

కాకతీయ యూనివర్సిటీలో పీహెచ్ డీ కేటగిరి-2లో జరిగిన అక్రమ అడ్మిషన్లపై విచారణ జరిపించాలని కోరిన విద్యార్థులపై పోలీసులు దాడి చేయడాన్ని నిరసిస్తూ కేయూ జాక్ ఆధ్వర్యంలో ఈ నెల 12న ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా విద్యాసంస్థల బంద్ కు పిలుపునిచ్చారు. బంద్ లో వివిధ రాజకీయ, ప్రజా సంఘాలు, విద్యార్థి సంఘాలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. దీక్ష కార్యక్రమాన్ని ప్రొఫెసర్ కూరపాటి వెంకటనారాయణ ప్రారంబించారు. వీసీని గవర్నర్ బర్త్ రఫ్ చేయాలని, విద్యార్థులపై భౌతిక దాడులకు పాల్పడిన పోలీసులను సస్పెండ్ చేయాలని, ఆంధ్ర రిజిస్టార్ ను తక్షణమే తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ హన్మకొండ జిల్లా అధ్యక్షుడు నాయిని రాజేందర్ రెడ్డి, చాడా శ్రీనివాస్ రెడ్డి, బీఎస్పీ జిల్లా అధ్యక్షులు మంద శ్యాం, రీజినల్ కోఆర్డినేటర్ కన్నం సునీల్, ధర్మ సమాజ పార్టీ నాయకులు సుమన్, ప్రజా సంఘాలు, విద్యార్థి సంఘాల నేతలు ఇట్టబోయిన తిరుపతియాదవ్, ఇడంపాక విజయ్ కన్నా, మంద వీరస్వామి, మేడ రంజిత్ కుమార్, గుగులోత్ రాజు నాయక్, మొగిలి వెంకట్రెడ్డి, తీగల ప్రేమ్ సుందర్, తాళ్ళపల్లీ నరేష్ గౌడ్, భాష బాయిన సంతోష్, బి.నరసింహ రావు, బొట్లమనోహర్, వేణురాజ్, తదితరులు పాల్గొన్నారు .

## అకెట్ జనరల్ సెక్రెటరీ డాక్టర్ మామిడాల ఇస్తారి..

కాకతీయ యూనివర్సిటీ విద్యార్థి సంఘాల నాయకులపై జరగుతున్న అకృత్యాలను అసోసియేషన్ ఆఫ్ కాకతీయ యూనివర్శిటీ టీచర్స్ ఖండిస్తుందని ఆ సంఘం అధ్యక్ష కార్యదర్శులు ప్రొఫెసర్ టి. శ్రీనివాస్, డాక్టర్ మామిడాల ఇస్తారి ఒక ప్రకటనలో తెలిపారు. సమస్యలపై పోరాడుతున్న విద్యార్థి సంఘాలపై అక్రమంగా కేసులు పెట్టడం భావ్యం కాదన్నారు. విద్యార్థుల సమస్యలు పరిష్కరించాల్సిన వీసీ, రిజిస్ట్రార్ లు సమస్యలను ఇంకా జటిలం చేస్తున్నారన్నారు. అక్రమంగా కేసులు పెట్టి విద్యార్థుల జీవితాలతో ఆడుకోవద్దనిఅకుట్ సూచించింది.














# నాపై వచ్చిన ఆరోపణల్లో నిజం లేదు

## విద్యార్థులే రెచ్చిపోయి ప్రవర్తించారు

## వరంగల్ సీపీ రంగనాథ్

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** కాకతీయ విశ్వవిద్యాలయం వీసీ కళ్లలో ఆనందం చూసేందుకు నేను గన్ పెట్టి బెదిరించానని, నేనే దగ్గరుండి కొట్టానని కేయూ విద్యార్థులు చేస్తున్న ఆరోపనల్లో నిజం లేదని వరంగల్ పోలీస్ కమిషనర్ ఏవీ రంగనాథ్ పేర్కొన్నారు. గురువారం కేయూ క్యాంపస్ లో వీసీ తాటికొండ రమేష్ తో కలిసి సీపీ విలేఖరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ కొంతమంది ఏబీవీపీ విద్యార్థులు వీసీ చాంబర్ డోర్ పగలగొట్టి, కంప్యూటర్లు ధ్వంసం చేశారని వెల్లడించారు. ఈ విద్యార్థులే ఫిబ్రవరి 28న బైరి నరేష్ పై కూడా దాడి చేశారని గుర్తు చేశారు. వైద్య పరీక్షల బోగస్ సర్టిఫికెట్లు పెట్టారని ఆరోపించారు. తమను పోలీసులు కొట్టారని మెజిస్ట్రేట్ ఎదుట వాగ్మూల ఇచ్చారన్నారు. పాత గాయాలు చూపించి జడ్జిని కూడా తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేశారన్నారు. ఇలాంటి ఆరోపణలు మాకు కొత్త కాదన్నారు. కేయూలో చాలా సంఘాలు ఉన్నప్పటికీ కొందరు కావాలని ఇలా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. చట్టాన్ని చేతిలోకి తీసుకుంటే ఊరుకోబోమని ముందే హెచ్చరించినా విద్యార్థులు పట్టించుకోలేదని అసహనం వ్యక్తం చేశారు. కేయూలో తప్పులు జరిగితే చట్టం, కోర్టుల ద్వారా పోరాడవచ్చు కానీ చట్టాన్ని చేతిలోకి తీసుకునే ప్రయత్నం చేస్తే పోలీసులు చూస్తూ ఊరుకుంటారా అని ప్రశ్నించారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం అయితే చట్టం ప్రకారం శిక్ష తప్పదన్నారు.

### అవకతవకలు లేవు : వీసీ రమేష్

పీహెచ్ డీ కేటగిరి-2 అడ్మిషన్ లలో ఎలాంటి అవకతవకలు జరగలేదని కేయూ వీసీ తాటికొండ రమేష్ స్పష్టం చేశారు. పారదర్శకంగా అడ్మిషన్ల ప్రక్రియ కొనసాగించామన్నారు. దౌర్జన్యం చేస్తే పాలకవర్గం భయపడుతుందని కొందరు భావిస్తున్నారన్నారు. మాకు కులం, మతంతో సంబంధం లేదన్నారు. ప్రతిభ ఉన్నవారికే సీట్లు కేటాయించామని స్పష్టం చేశారు. రూల్స్ కు అనుగుణంగానే సీట్లు కేటాయింపు జరిగిందన్నారు. మొన్న డోర్లు తన్నుకుంటూ కొందరు విద్యార్థులు నా చాంబర్ లోకి వచ్చి అసభ్యపదజాలంతో గలాటా సృష్టించారన్నారు. అక్రమ మార్గంలో పీహెచ్ డీలో అడ్మిషన్లు పొందేందుకే ఇలా చేస్తున్నారని మండిపడ్డారు. ఈ సమావేశంలో ఎంజీఎం ఆర్ ఎంఓ-2 మురళి, హనుమకొండ స్పెషల్ బ్రాంచ్ ఏసీపీలు జితేందర్ రెడ్డి, కిరణ్ కుమార్, కేయూ రిజిస్ట్రార్ సత్యనారాయణ, కేయూ ఇన్ స్పెక్టర్ అబ్బయ్య, ఎస్సైలు సురేష్, సుమన్ తదితరులు పాల్గొన్నారు.

## పేపర్ లీకేజీలో విద్యార్థికి ఊరట



**వరంగల్ వాయిస్, దామెర :** పదో తరగతి ప్రశ్న పత్రం లీకేజీలో దామెర మండలం సీతారాంపురం గ్రామానికి చెందిన డి.హరీష్ కు హైకోర్టులో ఊరట లభించింది. వివరాల్లోకి వెలితే.. కమలాపూర్ లో పదో తరగతి ప్రశ్న పత్రం లీకేజీలో హరీష్ ను భాద్యుడిని చేస్తూ ఆనాటి డీఈవో అన్యాయంగా డిబార్ చేశారు. మిగతా పరీక్షలు రాసినా కానీ ఫలితాలను వెలువరించకుండా హెూల్డ్ లో పెట్టారు. దీంతో పరకాల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ ఇనగాల వెంకట్రామ్ రెడ్డి ప్రోద్భలంతో హరీష్ కి అండగా ఎన్ ఎస్ యూఐ రాష్ట్ర అధ్యక్షుడు బల్మూరి వెంకట్ హై కోర్టుని ఆశ్రయించగా.. డిబార్ ఉత్తర్వులను కొట్టివేస్తూ, పరీక్ష ఫలితాలను కూడా ప్రకటించాలని హై కోర్టు ఆదేశించింది. దీంతో ఇనగాల వెంకట్రామ్ రెడ్డి గురువారం హరీష్ కుటుంబాన్ని హైదరాబాద్ లోని గాంధీ భవన్ కి పిలిపించి బల్మూరి వెంకట్ సమక్షంలో హరీష్ కుటుంబానికి అన్నివిధాలుగా అండగా ఉంటానని, అతనిపై చదువులకు కూడా సహాయం చేస్తానని హామీ ఇచ్చారు. రాష్ట్ర విద్యాశాఖ తక్షణమే హరీష్ పరీక్ష ఫలితాలను ప్రకటించాలని డిమాండ్ చేశారు.

## ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు

### ఉత్సాహంగా పాల్గొన్న విద్యార్థులు





**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** శ్రీ కృష్ణ జన్మాష్టమి పర్వదినం సందర్భంగా గిర్మాజీపేట్ బొడ్రాయిలోని గోమతి పబ్లిక్ స్కూల్లో గురువారం శ్రీ కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. పాఠశాల విద్యార్థులకు శ్రీకృష్ణ, రాధా, గోపికల వేషధారణ పోటీలు నిర్వహించి ఉత్తమ అలంకరణలకు బహుమతులు ప్రధానం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పాఠశాల కరస్పాండెంట్ కూచన క్రాంతి కుమార్ శ్రీకృష్ణుడి లీలలు, వారి మహత్యం గురించి వివరించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ కూచన హారతి, ఇన్చార్జి కరుణ, ఉపాధ్యాయులు సంధ్య, శృతి, శ్రీవిద్య, సంయుక్త, ఫరీదా పాల్గొన్నారు.

### టెక్నో సెన్స్ హై స్కూల్ లో..

వరంగల్ వాయిస్, హనుమకొండ : శ్రీ కృష్ణాష్టమి పండుగ సందర్భంగా గురువారం రెడ్డి పురంలోని టెక్నో సెన్స్ హై స్కూల్ లో వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రాజమల్లు మాట్లాడుతూ విద్యార్థిని విద్యార్థులు గోపిక, శ్రీ కృష్ణుడిని ఆదర్శంగా తీసుకుని ఉన్నతంగా ఎదగాలని ఆకాంక్షించారు. విద్యార్థులు శ్రీకృష్ణా వేషధారణలో పాల్గొని ఆటపాటలతో అందరిని ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో స్కూల్ సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.





## ఘనంగా ధ్వజ స్తంభ ప్రతిష్ఠాపన

### పాల్గొన్న ఎమ్మెల్యే దంపతులు



**వరంగల్ వాయిస్, భూపాలపల్లి :** భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని మంజూరు నగర్ లో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం సమీపంలో భూపాలపల్లి శాసనసభ్యులు గండ్ర వెంకటరమణారెడ్డి జ్యోతి దంపతులు ఆధ్వర్యంలో నిర్మిస్తున్న శ్రీ వెంకటేశ్వర స్వామి నూతన విగ్రహ ప్రతిష్ఠాపన మహెూత్సవ వేడుకల్లో భాగంగా మూడో రోజు గురువారం కుంభారాదనం, ఉత్త హెూమములు, యంత్ర రత్న ధాతు, ధీజన్యాసములు, విగ్రహ ధ్వజ స్తంభ ప్రతిస్ఠాపన, అష్ట బంధన సమర్పణం కార్యక్రమాలను వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య అంగరంగ వైభవంగా నిర్వహించారు. అఖిలాండ కోటి బ్రహ్మాండ నాయకుడు శ్రీ వెంకటేశ్వర స్వామి ప్రతిష్ట మహెూత్సవ వేడుకలో నియోజవర్గ వ్యాప్తంగా వేలాదిమంది భక్తులు తరలివచ్చి ఆశాంతం తిలకించారు. ఉత్సవ కార్యక్రమాల్లో కలియుగ ప్రత్యక్ష దైవమైన శ్రీ వేంకటేశ్వర స్వామి వారి విగ్రహ ప్రతిష్ట మహెూత్సవ వేడుకలో తమ వంతు విరాళంగా పలువురు దాతలు నగదు అందించారు. తిరుమల వెంకటేశ్వర స్వామి సన్నిధిలో కృష్ణ శిలచే చెక్కబడిన రాయి కట్టడంతో నిర్మిస్తున్న శ్రీ వేంకటేశ్వర స్వామి విగ్రహం, ఆలయం ఎంతో ప్రతిష్ఠలతో కూడుకున్నదని ఎమ్మెల్యే వివరించారు. కేవలం 14 నెలల్లోనే ఈ ఆలయాన్ని స్థానిక భక్తుల సహాయంతో శిల్పి వెంకటేష్ బృంద సహాయంతో నిర్మించుకోవడం భూపాలపల్లి పట్టణం చేసుకున్న అదృష్టంగా భావిస్తున్నామని అన్నారు. వేలాదిగా వచ్చిన భక్తులందరికీ ఎమ్మెల్యే గండ్ర దంపతులు ఆలయ కమిటీ ట్రస్టు సభ్యులు ఆధ్వర్యంలో ఉచిత మహా అన్నదాన ప్రసాద కార్యక్రమాలు నిర్వహించారు.

## బీజేపీ టికెట్‌కు సంపత్ దరఖాస్తు

**వరంగల్ వాయిస్, రఘునాథపల్లి :** భారతీయ జనతా పార్టీ జనగామ అసెంబ్లీ నియోజకవర్గం రఘునాథపల్లి మండలం నిడిగొండ గ్రామానికి చెందిన రాష్ట్ర రజక సంఘం నాయకుడు కొన్నే సంపత్ గురువారం హైదరాబాద్ బీజేపీ కార్యాలయంలో ఎమ్మెల్యే టికెట్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. మోడీ నాయకత్వంలో దేశంలోనే అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారని సంపత్ తెలిపారు. త్వరలో గ్రామ గ్రామాన ప్రచారానికి శ్రీకారం చూడుతానన్నారు. కచ్చితంగా ఎన్నికల్లో పోటీ చేయడానికి ప్రణాళిక సిద్ధం చేసుకున్నట్లు ఆయన వివరించారు.






EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DIST DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com